

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2030 | సంచిక : 309 | శనివారం 21 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమించిన కాంగ్రెస్..

2029 ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రక్షాళన.. సామాజిక న్యాయానికి పెద్దపీట

ఏఐసీసీ నూతన కార్యదర్శుల జాబితా విడుదల.. 43 మంది కొత్త ముఖాలకు చోటు

రాహుల్ గాంధీ మార్క్ టీమ్.. యువత, బడుగు బలహీన వర్గాలకే అగ్రతాంబూలం



రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ ప్రక్షాళన చేపట్టింది. వివిధ రాష్ట్రాలు, కీలక విభాగాల పర్యవేక్షణ కోసం మొత్తం 81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

నీటి హక్కులపై రాజీ లేదు.. చుక్క నీటిని కూడా ఏపీకి వదులుకోం

తెలంగాణ హక్కులను కాపాడతామని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ

నాగార్జునసాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటి తరలింపుపై ఏపీ ప్రతిపాదన

దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న మంత్రి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో లాలూచీ పడి తెలంగాణకు అన్యాయం చేసిందని ఆరోపణ

సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఏర్పడిందన్న విషయాన్ని కేటీఆర్ మర్చిపోయారని విమర్శ

రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రజలకు హామీ



తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, కృష్ణా, గోదావరి నదుల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం

ఖనిజ సంపదపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష..

ఏపీలో రేర్ ఎర్త్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం



ఏపీలో రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఏపీఎండీసీ ఐపీవోకు సన్నాహాలు

ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం

ఒడిశా, ఝార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనున్న ఏపీఎండీసీ

పెండింగ్ క్వారీ లీజుల పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం అంచనా

2లో

ఏపీలో ఖనిజ సంపద సద్వినియోగం, ఆదాయార్జనపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో అరుదైన ఖనిజాల అన్వేషణ, విలువ జోడింపు కోసం ప్రత్యేకంగా 'ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏపీఆర్ఈడీసీ) ఏర్పాటుకు సీఎం నారా చంద్రబాబు



అలపోటు!

తీరం దాటిన 'అక్వాన్' తుపాను.. ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు

ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లు రద్దు చేసిన ఈస్ట్ కోస్ట్ రైల్వే

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు. తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది.తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది.

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి పోలీసు కస్టడీ



బ్యాలెట్ బాక్స్ వివాదం కేసు.. లేళ్ల అప్పిరెడ్డిని విచారించనున్న పోలీసులు

బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు

ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అప్పిరెడ్డి

2లో

పవన్ కాదు 'ఎంపవర్ స్టార్'..

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ

మహిళలు, విద్యార్థినుల సాధికారతకు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్న ఉపాసన

అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని వెల్లడి

2లో



కడప జడ్పీ పీఠం వివాదం.



2లో

వైభవంగా శ్రీశైలంలో కోటి దీపోత్సవం



కోటి దీపాలతో వెలుగులీనిన దేవస్థానం

కైలాస పర్వత నమూనాలో ప్రత్యేక వేదిక ఏర్పాటు

నంద్యాల జిల్లాలోని శ్రీశైల క్షేత్రంలో కొలువైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ఆగమ పాఠశాల ముందుభాగంలోని మైదానంలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం కైలాస పర్వత నమూనాలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అత్యంత వైభవంగా దీపోత్సవాన్ని నిర్వహించారు.

2లో

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!

టీడీపీకి 22 జడ్పీ చైర్మన్ స్థానాలు

జనసేనకు 4,

బీజేపీకి ఒక స్థానం

వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఈసీ ప్రకటన

2లో



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా

తాడిపత్రిలో మరోసారి రణరంగం

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై దాడి..

వాహనాల దహనం పరస్పరం రాళ్లు, పెట్రోల్ బాంబులతో దాడులు



తాడిపత్రి పట్టణం మరోసారి రణరంగంగా మారింది. శుక్రవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై జేసీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో కార్లు, ద్విచక్ర వాహనాలను తగలబెట్టారు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో టీడీపీ వర్గీయులు ఒక్కసారిగా చెలరేగిపోయారు. విషయం తెలుసుకున్న పెద్దారెడ్డి వర్గీయులు రాళ్లతో దాడులకు దిగారు. ఇరువర్గాలు పెట్రోల్ బాంబులతో దాడులు చేసుకున్నాయి. దీంతో తాడిపత్రి పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యంగా రిగ్గింగ్ చేసి విజయం సాధించిందని పెద్దారెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే విధంగా దాడులు జరిగాయని పేర్కొన్నారు.

2లో

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచిందన్న కిషన్‌రెడ్డి



2లో

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి పోలీసు కస్టడీ

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ గుంటూరు న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపు వ్యవహారంలో వివాదం చోటుచేసుకుంది. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు బ్యాలెట్ బాక్సును బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలతో నల్లపాడు పోలీసులు అప్పిరెడ్డిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా లేళ్ల అప్పిరెడ్డిని మరింత లోతుగా ప్రశ్నించాల్సి ఉందని పేర్కొంటూ నల్లపాడు పోలీసులు గుంటూరు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, పోలీసుల విజ్ఞప్తికి ఆమోదం తెలుపుతూ 3 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో నల్లపాడు పోలీసులు ఆయన్ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. మరోవైపు, ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అప్పిరెడ్డి తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. బెయిల్ పిటిషన్‌పై నవంబర్ 25న తుది నిర్ణయం వెలువరించనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

పరిషత్‌ల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది.రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ చైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ చైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లాల వారీగా చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.

పవన్ కాదు 'ఎంపవర్ స్టార్'..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త, అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల పర్యటించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీతో కలిసి ఆమె పిఠాపురం పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అపోలో ఫౌండేషన్ చేపట్టిన 'అపోలో ఆరంభ్' ప్రాజెక్టులో భాగంగా కొణిదెల కుటుంబ సహకారంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజన్‌ను ఉపాసన కొణిదెల ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల్లో పవన్ కల్యాణ్ 'పవర్ స్టార్'గా సుపరిచితులైనప్పటికీ, పిఠాపురంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సాధికారత కార్యక్రమాలను చూసిన తర్వాత తనకు ఆయన 'ఎంపవర్ స్టార్'గా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, రుణాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఏర్పాటుతో విద్యార్థుల సాధికారతకు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి కేంద్రాన్ని పిఠాపురంలో ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రం స్థానిక తల్లులు, చిన్నారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుందని నిర్వాహకులు వెల్లడించారు.

తాడిపత్రిలో మరోసారి రణరంగం

సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయకుండా భయాందోళనలు కలిగించేందుకే తన ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మరోవైపు తాడిపత్రిలో హింసాత్మక ఘటనలకు తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు వైసీపీని, ముఖ్యంగా పెద్దారెడ్డిని వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.

కడప జడ్పీ పీఠం వివాదం..

కడప జడ్పీ చైర్మన్ పదవిని టీడీపీకి కేటాయించడంపై ఆదినారాయణరెడ్డి అసంతృప్తి

జమ్మలమడుగు పరిధిలో కూటమి తరఫున 46 స్థానాలకు 46 గెలిపించామని వెల్లడి

రాత్రికి రాత్రే పరిస్థితులు మారిపోయాయంటూ ఆవేదన

కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని టీడీపీకి కేటాయించడంపై జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప జడ్పీ పీఠాన్ని టీడీపీకి ఖరారు చేయడంతో కూటమిలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఈ నిర్ణయంతో అసంతృప్తికి గురైన ఆదినారాయణరెడ్డి తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను కూటమి కోసం ఎంతో నిబద్ధతతో పనిచేశానని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జమ్మలమడుగు పరిధిలో 46 స్థానాలకు గాను 46 స్థానాల్లోనూ విజయం సాధించామని గుర్తుచేశారు. అయితే రాత్రికి రాత్రే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా మార్పులు చేర్పులు చేయాలనుకుంటే తనకు అర సెకన్ కూడా పట్టదని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై అధిష్ఠానంతో చర్చిస్తానని, తన తుది నిర్ణయాన్ని రేపు ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ పదవిని తన సోదరుడి కుమారుడు డాక్టర్ చాదిపిరాళ్ల రాజేశ్ రెడ్డికి కేటాయిస్తారని ఆదినారాయణరెడ్డి ఆశించారు. అయితే అనూహ్యంగా వేరొకరికి కేటాయించడంతో ఈ వివాదం మొదలైంది. మరోవైపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో ఆదినారాయణరెడ్డి స్వయంగా మాట్లాడారు. తన నిర్ణయం మార్చుకోనేది లేదని స్పష్టం చేశారు.

సామాన్యుడి బైక్‌పై ధరల భారం.. హీరో స్ప్లెండర్ ప్లస్ రేట్లు రూ.3,086 పెంపు



భారతదేశంలో 100సీసీ కమ్యూటర్ బైక్‌లలో తిరుగులేని ఆదరణ కలిగిన 'హీరో స్ప్లెండర్ ప్లస్' ధరలను దేశీయ ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ పెంచింది. స్ప్లెండర్ మార్కెట్లోకి వచ్చి 32 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రస్తుతం లభిస్తున్న నాలుగు వేరియంట్లపై గరిష్ఠంగా రూ. 3,086 వరకు ధరలు పెరిగాయి. కంపెనీ గతంలో అందించిన 'బ్లాక్ అండ్ యాక్సెంట్' మోడల్‌ను ఇప్పుడు 'స్పెషల్ ఎడిషన్స్'గా రీబ్రాండ్ చేసింది. ఈ స్పెషల్ ఎడిషన్‌లో మ్యాట్ గ్రే, మ్యాట్ వెర్మిలియర్ గ్రే, క్యాండీ బ్లేజింగ్ రెడ్ అనే మూడు సరికొత్త రంగులను పరిచయం చేశారు. కాగా ఈ స్పెషల్ ఎడిషన్ వేరియంట్‌పైనే అత్యధికంగా రూ. 3,086 పెరగడంతో దీని ధర రూ. 81,666కు చేరింది. బేస్ డ్రమ్ వేరియంట్, ఐ3ఎస్, 125 మిలియన్ ఎడిషన్లపై రూ. 1,135 చొప్పున ధరలు పెరిగాయి. మరోవైపు సరికొత్త సాంకేతికతతో వచ్చిన 'ఎక్స్‌టెక్ 2.0' వేరియంట్‌లో ఎల్ఈడీ హెడ్‌లైట్, ఇండికేటర్లకు హజార్డ్ లైట్ల ఫీచర్లను జోడించినప్పటికీ, ఇందులో ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయం ఇవ్వకపోవడం గమనార్హం. ప్రస్తుతం ముందు వైపు డిస్క్ బ్రేక్ సదుపాయం కేవలం సాధారణ ఎక్స్‌టెక్ వేరియంట్‌లో మాత్రమే అందుబాటులో ఉంది (ధర రూ. 85,461). ఫ్లెక్స్-ఇంధన ఇంజిన్‌తో వచ్చిన స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ వేరియంట్ ధర కూడా రూ. 1,332 పెరిగి రూ. 84,042కు చేరింది.

నిత్యావసరాల ధరల నియంత్రణకు ఏడాది యాక్షన్ ప్లాన్.. నెలకు రూ.100 కోట్లు ఖర్చు

నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ధరల నియంత్రణపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను అరికట్టేందుకు ప్రతివారం సమీక్షలు జరపడంతో పాటు నిరంతర క్షేత్రస్థాయి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ధరల స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ.100 కోట్లను వెచ్చిస్తోందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చౌకధరల దుకాణాల (రేషన్ షాపులు) ద్వారా ప్రత్యేక సబ్సిడీ ధరలతో సరుకులను పంపిణీ చేయనున్నారు. ఈ నిర్ణయం ప్రకారం కిలో కందిపప్పు రూ.100, కిలో గోధుమ పిండి రూ. 25, లీటర్ పామాయిల్ రూ.125 చొప్పున కార్డుదారులకు అందజేయనున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థలోని రేషన్ బియ్యం అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ నిల్వలపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. పప్పుధాన్యాలు, వంటనూనెలతో పాటు మార్కెట్లో కూరగాయల ధరల హెచ్చుతగ్గులపైనా నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. పంటలు పండించే అన్నదాతలకు నష్టం వాటిల్లకుండా, కొనుగోలు చేసే సామాన్యుడిపై భారం పడకుండా సమతుల్య విధానాలతో చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పత్రిక కొంటే వార్తలు చదవాలా..ప్రకటనలు చూడాలా...?

14 పేజీల ప్రకటనల తర్వాత 15వ పేజీలో వార్తలా? వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్న పత్రికా రంగం..పాఠకుడి విశ్వాసానికి విలువ ఎక్కడ? పత్రిక అనేది కేవలం కాగితాల కట్ట కాదు. అది సమాజానికి సమాచారాన్ని అందించే సాధనం.ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే వేదిక.అధికార వ్యవస్థను ప్రశ్నించే గొంతుక.ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే బాధ్యతాయుతమైన వ్యవస్థ.అలాంటి పత్రికా రంగంలో నేడు వాణిజ్య ప్రకటనల ఆధిపత్యం పెరుగుతుండటం ఆందోళన కలిగించే పరిణామం. ఒక ప్రముఖ తెలుగు దినపత్రికను వార్తలు చదవాలనే ఉద్దేశంతో కొనుగోలు చేసిన పాఠకుడికి మొదటి పేజీ నుంచి వరుసగా 14 పేజీల పాటు కేవలం ప్రకటనలే దర్శనమిస్తే అతడి పరిస్థితి ఏమిటి? అసలు వార్తలు చదవాలంటే 15వ పేజీ వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడితే దాన్ని పత్రికా వ్యాపార ధోరణిగా మాత్రమే చూడాలా? లేక పాఠకుడి పట్ల బాధ్యతను విస్మరించిన తీరుగా భావించాలా? ప్రకటనలు పత్రిక లకు ఆదాయ వనరు అనడంలో ఎలాంటి సందేహం లేదు.పత్రికల నిర్వహణ,సిబ్బంది వేతనాలు, ముద్రణ, పంపిణీ వంటి అనేక ఖర్చులకు ప్రకటనల ఆదాయం అవసరం.వాణిజ్య ప్రకటనలకు పత్రికల్లో స్థానం ఉండాలి. కానీ,ఆ ప్రకటనలే పత్రికకు ప్రధాన ఆకర్ష ణగా మారి,వార్తలు వెనుకబడిపోతే మాత్రం పత్రిక అసలు ఉద్దేశమే ప్రశ్నార్థకమవుతుంది.

-పాఠకుడి డబ్బుకు విలువ లేదా?

ఒక పత్రికను కొనుగోలు చేసే వ్యక్తి అందులోని వార్తలు, విశ్లేషణలు, సంపాదకీయాలు, ప్రజా సమ స్యల పై కథనాలను చదవాలనే ఆశతో డబ్బులు చెల్లిస్తాడు.ప్రకటనల కోసం మాత్రమే ఎవరూ పత్రి కను కొనుగోలు చేయరు.అలాంటప్పుడు పాఠకు డు చెల్లించిన ధరకు తగిన సమాచారాన్ని అందిం చడం పత్రిక కనీస బాధ్యత కాదా? ప్రకటనలు ప్రచురిం చడం తప్పు కాదు.కానీ,వార్తలకు కేటాయించాల్సిన స్థలాన్ని పూర్తిగా ప్రకటనలతో నింపేసి,పాఠకుడిని వార్తల కోసం పేజీలు తిప్పేలా చేయడం ఎంతవరకు సమంజసం? పత్రికను కొనుగోలు చేసిన వ్యక్తి ఒక వినియోగదారుడు మాత్రమే కాదు. పత్రికను ఆదరించి, దాని మనుగడకు తన వంతు సహకారం అందిస్తున్న పాఠకుడు కూడా.

-జాకెట్ యాడ్స్..జర్నలిజానికి సవాలా?

ప్రస్తుతం పత్రికా రంగంలో జాకెట్ ప్రకటనలు, ప్రత్యేక ప్రకటనల పేరుతో భారీ స్థాయిలో వాణిజ్య ప్రచారం జరుగుతోంది.ప్రకటనల ద్వారా సంస్థలు ఆదాయం సంపాదించుకోవడం సహజమే.అయితే ఒక దినపత్రికలో వార్తల కంటే ప్రకటనలకే అధిక ప్రాధాన్యత లభిస్తే,అది పత్రికా విలువలపై చర్చకు దారితీస్తుంది. ఒకవైపు ప్రజాస్వామ్యం,ప్రజా సమ స్యలు, సామాజిక బాధ్యత గురించి సంపాదకీయాల్లో గొప్పగా రాస్తూ..మరోవైపు పత్రికలోని అత్యధిక పేజీలను ప్రకటనలకు కేటాయిస్తే ఆచరణకు, ఆదర్శా లకు మధ్య అంతరం కనిపించదా? పత్రిక వ్యాపార సంస్థగా ఉండొచ్చు.కానీ, అది కేవలం వ్యాపార సంస్థ గా మిగిలిపోవాలా? సమాజం పట్ల తనకున్న బాధ్య తను కూడా గుర్తించాల్సిన అవసరం లేదా?

ప్రకటనల ఒత్తిడిలో వార్తల ప్రాధాన్యత తగ్గకూడదు

పత్రికా స్వేచ్ఛ అంటే కేవలం వార్తలు ప్రచురించే హక్కు మాత్రమే కాదు.ప్రజలకు అవసరమైన సమా చారాన్ని బాధ్యతాయుతంగా అందించే కర్తవ్యం కూడా.

ప్రభుత్వ విధానాలు,ప్రజాప్రతినిధుల పని తీరు, అవినీతి,రైతుల సమస్యలు, నిరుద్యోగం, విద్య, వైద్యం, స్థానిక ప్రజా సమస్యలు వంటి అంశాలకు పత్రికల్లో తగిన ప్రాధాన్యత ఉండాలి. ప్రకటనల కోసం పేజీలు పెరుగుతున్నా,ప్రజా సమస్యలకు కేటాయించే స్థలం తగ్గిపోతే పత్రిక తన సామాజిక పాత్రను కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రకటనదారుడి ప్రయోజనం ఎంత ముఖ్యమో,పాఠకుడి సమాచార హక్కు కూడా అంతే ముఖ్యమైనది.

-పత్రిక బతకాలి..పత్రికా విలువలూ బతకాలి

పత్రికలు ఆర్థికంగా బలంగా ఉండాలి.ప్రకటనల ఆదాయం పెరగాలి.సాంకేతికంగా అభివృద్ధి చెందాలి. వీటన్నింటినీ ఎవరూ వ్యతిరేకించరు.కానీ,ఈ క్రమం లో వార్తలకు,జర్నలిజం విలువలకు,పాఠకుడి నమ్మకా నికి విఘాతం కలగకూడదు.ప్రకటనలు పత్రికకు ఆదాయాన్ని తెస్తే,వార్తలు పత్రికకు విశ్వసనీయతను తీసుకొస్తాయి. ఆదాయం లేకుండా పత్రిక మనుగడ కష్టమే.విశ్వసనీయత లేకుండా పత్రికకు భవిష్యత్తు ఉండదు.14 పేజీల ప్రకటనల తర్వాత 15వ పేజీలో వార్తలు కనిపించే పరిస్థితి ఒక్కరోజు జరిగిన సంఘటన కావచ్చు.కానీ,అది పత్రికా రంగం అనుస రిస్తున్న వ్యాపార ధోరణులపై ఒక పెద్ద ప్రశ్నను మాత్రం లేవనెత్తుతోంది.చివరగా ఒక్కటే ప్రశ్న.. పాఠకుడు డబ్బులు చెల్లించి పత్రిక కొనుగోలు చేసేది ప్రకటనలు చూడటానికా? వార్తలు తెలుసుకో వడానికా?

ప్రకటనలు పత్రికకు ఆదాయం..వార్తలు పత్రికకు ఆత్మ.ఆదాయం కోసం ఆత్మనే పక్కన పెడితే మిగిలేది పత్రిక కాదు..ప్రకటనల సంకలనం మాత్రమే.పత్రికా యాజమాన్యాలు ఈ విషయాన్ని ఆలోచించాలి. ఎందుకంటే పత్రికను నిలబెట్టేది ప్రకటనల డబ్బు మాత్రమే కాదు..దశాబ్దాలుగా దానిని నమ్మి చదువుతున్న పాఠకుడి విశ్వాసం కూడా.

81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమించిన కాంగ్రెస్..

ఈ నియామకాల్లో రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా 'సామాజిక న్యాయం' సూత్రానికి పెద్దపీట వేశారు. మొత్తం 81 మంది కార్యదర్శుల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 29 మంది, ఓబీసీ నుంచి 20, ఈబీసీ నుంచి 5, ఎస్సీల నుంచి 11, ఎస్టీల నుంచి 5, మైనార్టీల నుంచి 11 మందికి చోటు దక్కింది. మహిళా ప్రాతినిధ్యం కింద 12 మందికి (సుమారు 15 శాతం) బాధ్యతలు అప్పగించారు. ఈ నేతల సగటు వయస్సు 49 ఏళ్లు కాగా, మెజారిటీ నాయకులు 50 ఏళ్ల లోపు వారే కావడం విశేషం. ఈ ఎంపిక కోసం రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలు దాదాపు 200 మంది నేతలను స్వయంగా ఇంటర్వ్యూ చేసి జాబితాను సిద్ధం చేశారు. మీడియా, కమ్యూనికేషన్స్ విభాగ కార్యదర్శులుగా డాక్టర్ వినీత్ పునియా, రుచిరా చతుర్వేదిలను కొనసాగించగా, కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయ కార్యదర్శులుగా ప్రణవ్ ఝా, గౌరవ్ పాంధీలు తమ బాధ్యతల్లో కొనసాగనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఈ నూతన కార్యదర్శుల బృందానికి కాంగ్రెస్ నాయకత్వం అప్పగించింది.

నీటి హక్కులపై రాజీ లేదు.. చుక్క నీటిని కూడా ఏపీకి వదులుకోం

చేశారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని, ఏ త్యాగానికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. హుజూర్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో, హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.నాగార్జున సాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏకపక్ష ప్రతిపాదనపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా అభ్యంతరాలు తెలిపామని వెల్లడించారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా దేశ సరిహద్దుల్లో ఎంత పట్టుదలతో పనిచేశానో, రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణలోనూ అదే తెగువ చూపిస్తానని ఆయన అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా బేసిన్ రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నుంచి 4,460 టీఎంసీలు తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకున్నారని, ఆ సమయంలో తెలంగాణ కేవలం 1993 టీఎంసీలు మాత్రమే వాడుకుందని తెలిపారు. తాము ఏపీ నేతలతో లాలూచీ పడేవాళ్లం కాదని, అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి వాడకం పెరిగిందని గణాంకాలతో వివరించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఈ విషయాన్ని కేసీఆరే స్వయంగా అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. ఆమె వల్లే తమ కుటుంబానికి పదవులు వచ్చాయన్న విషయాన్ని కేటీఆర్ మర్చిపోయి మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని, అర్హులందరికీ చేయూత పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఖనిజ సంపదపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష..

నాయుడు ఆమోదం తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు ఉద్దేశించిన ఐపీవో ప్రతిపాదనలకు కూడా అంగీకారం తెలిపారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో గనుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను కేవలం ఆదాయ వనరుగా కాకుండా భవిష్యత్ తరాలకు ఆస్తిగా చూడాలని, వాటి విలువ పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. మన వనరులను మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి సుమారు 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్‌ను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని సమావేశంలో చర్చించారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైలంలో కోటి దీపోత్సవం

ఈ కార్యక్రమానికి అవసరమైన పూజా ద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. సాయంత్రం 4.30 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డా. దీవి హయగ్రీవాచార్యులు కోటి దీపోత్సవ విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం సంప్రదాయ నృత్య కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక వేదికపై శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి కోటి దీపోత్సవాన్ని జరిపించారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవార్లకు ఓంకార హారతి, నాగ హారతి, త్రిశూల హారతి, నంది హారతి, సింహ హారతి, సూర్య హారతి, చంద్ర హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతి కలిపి దశవిధ హారతులు సమర్పించారు. వీటి అనంతరం ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో బృందంతో భక్తి సంగీత స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. చివరగా మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనంతో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైదిక సంప్రదాయంలో దీపానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దీపజ్యోతిని యజ్ఞాగ్నికి సంకేతంగా భావించడం మన సంప్రదాయమని తెలిపారు. అందుకే సంప్రదాయబద్ధంగా, శ్రీ స్వామి, అమ్మవార్ల కైంకర్యంగా కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జ్ఞానం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, శాంతికి దీపం ప్రతీకగా నిలుస్తుందని, దీపారాధనతో ఈ దివ్యగుణాలను పొందవచ్చని పండితులు చెబుతున్నారని వివరించారు. పరమేశ్వరునికి దీపజ్యోతిని సమర్పించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి

రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శ

రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ఓట్లు పడవని జోస్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై భారతీయ జనతా పార్టీ అసలైన ఆట ప్రారంభమవుతుందని సంచలన ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం నిశ్చయమైన రాజకీయ మార్పును బలంగా ఆకాంక్షిస్తున్నారని, ఆ మార్పును నిజం చేసే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసి

నంద్యాల జడ్పీ నూతన చైర్‌పర్సన్‌గా షేక్ బృహనుద్దీన్, వైస్ చైర్‌పర్సన్‌గా కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 20 (నంది పత్రిక) నంద్యాల జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా బనగానపల్లె జడ్పీటీసీ సభ్యులు షేక్ బృహనుద్దీన్ , వైస్ చైర్‌పర్సన్‌గా సిరివెళ్ల జడ్పీటీసీ సభ్యులు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ షేక్ బృహనుద్దీన్, వైస్ చైర్‌పర్సన్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డిలతో పాటు నూతన జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యులతో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్ , బీసీ జనార్దన్ రెడ్డి , జిల్లా పరిశీలకులు వైకుంఠ ప్రభాకర్ చౌదరి , టీడీపీ జిల్లా అధ్యక్షురాలు మరియు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి , నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య , జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తదితరులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ బృహనుద్దీన్ గారికి, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని . నూతన పాలకవర్గం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి, జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు . మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో జడ్పీటీసీ సభ్యులంతా సమన్వయంతో పనిచేసి నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు.

నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం.



బేతంచెర్ల నవంబర్ 20 (నంది పత్రిక). బేతంచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గురువారం హాజరై, నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ఎంపీటీసీ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో బేతంచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలిగా సుమలతను,ఉపాధ్యక్షుడుగా ఉన్నం నాగార్జున చౌదరి ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ అధ్యక్షురాలు,ఉపాధ్యక్షులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు.బేతంచెర్ల జడ్పిటిసి సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోలూరు వీర రాఘవ చౌదరి (పోలూరు రాఘవ రెడ్డి).,బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధికారి ఎం.ఫజుల్ రహిమాన్, బేతంచెర్ల మండలము వివిధశాఖల అధికారులు,నగర పంచాయితీ అధికారులు, టిడిపి ముఖ్య నాయకులు తదితరులు ఈ నూతనముగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న నాయకత్వమే మనందరి లక్ష్యం





వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేయాలి

ఎంపి మేడా రఘునాథ రెడ్డి

రాజంపేట (నంది పత్రిక ప్రతినిధి) నవంబర్ 20: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో, ఐకమత్యంతో కృషి చేయాలని ఎంపీ మేడా రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజంపేటలోని మేడా భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, ఎంపీ మేడా రఘునాథ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి మరియు ఒంటిమిట్ట, నందలూరు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ మేడా రఘునాథ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. రాజంపేట నియోజకవర్గంలో మనందరిదీ ఒకే వర్గమని, అదే జగనన్న వర్గమని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గమని స్పష్టం చేశారు. మేడా, ఆకేపాటి అనే తేడాలు, వ్యక్తిగత అభిప్రాయ భేదాలకు తావులేకుండా అందరం ఒక్కటిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మనమంతా జగనన్న కోసం, ఆయన నాయకత్వాన్ని బలోపేతం చేయడం కోసం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి పార్టీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు కూడగట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట, నందలూరు మండలాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, సర్పంచ్ మరియు వార్డు సభ్యుల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

59వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు.



బేతంచెర్ల నవంబర్ 20 (నందిపత్రిక). బేతంచెర్ల శాఖ గ్రంధాలయం 59 వ జాతీయ ముగింపు సభసందర్భంగా బేతంచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలలో గెలుపొందిన వారికి ఇంచార్జ్ హెడ్ మాస్టార్ సావిత్రి చేతుల మీదుగా బహుమతులు శుక్రవారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బేతంచెర్ల శాఖ గ్రంధాలయ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు స్కూలు సెలవు దినాలలో గ్రంధాలయమునకు వచ్చి పుస్తకములను చదువు కోవాలని అన్నారు. శరీర ధృడత్వానికి ఆట పాటలను వారు ఆదుకోవటానికి కుడా గ్రంధాలయం ఆవరణలో మంచి సౌఖ్యం కలదన్నారు. కనుక గ్రంధాలయంలో సభ్యత్వం తీసుకొని గ్రంధాలయాలను సద్వినియోగం చేసు కోవలయునని(గ్రంధలయ అధికారి కోరారు. ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టార్ సావిత్రితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

24వ వార్డులో మూడు నెలలుగా పైపులైన్ లీకేజీ.. రోజూ వేల లీటర్ల తాగునీరు వృథా!

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి డివైఎఫ్ఐ



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 20 . (నంది పత్రిక): నంద్యాల పట్టణంలోని 24వ వార్డు, సీపీఎం పార్టీ కార్యాలయం పరిసర ప్రాంతంలో గత మూడు నెలలుగా పైపులైన్ లీకేజీ సమస్యతో రోజూ వేల లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులోని రెండు ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీ కారణంగా నిరంతరం నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోందని, దీనివల్ల స్థానిక ప్రజలు, అటుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యపై అధికారులకు తెలిసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు.ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నీటిని వృథా చేయవద్దని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ప్రజలకు సూచనలు చేస్తున్నారు. మరి నంద్యాల పట్టణంలో గత మూడు నెలలుగా వేల లీటర్ల నీరు వృథాగా పోతున్న విషయం మున్సిపల్ కమిషనర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత కలిగిన మున్సిపల్ అధికారులు కనీసం పైపులైన్ లీకేజీలను కూడా అరికట్టలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు శాశ్వత మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో 24వ వార్డు డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు దుర్గసాయి, చరణ్ రెడ్డి, రాజు, నిరంజన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా స్వామ్యాన్ని కూనీ చేస్తున్న కూటమికి బుద్ధిచెబుదాం

- ఇలాంటీ ఎన్నికలు ఎక్కడా, ఎన్నడు జరగలేదు

- 9 స్థానాలకు 10 డిక్లరేషన్ ఫారమ్లు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది.

- సర్పంచు ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయండి

-ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించిన యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

కొత్తపల్లి – నంది పత్రిక : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా స్వామ్యాన్ని కూనీ చేస్తుందని, ఇలాంటి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని వైఎస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం నందు నూతనంగా ఎన్నికైన ఎంపీపీ పెరుగు నాగలక్ష్మి రెడ్డిని, వైస్ ఎంపీపీ రాజమూరి పుల్లయ్యను వారితో పాటు ఎంపీటీసీలు లక్ష్మీదేవిలను పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా అధికారం చేజిక్కుంచుకొనేందుకు ప్రజా స్వామ్యాన్నే కూనీ చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు జరిగినట్లు ఎక్కడా, ఎప్పుడు జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఓట్లతో కాకుండా అధికార బలంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు అడ్డదారిలో గెలిచి రాజ్యాంగ హక్కు అయిన ఓటు హక్కును తుంగలో తొక్కిందని ద్వజమెత్తారు. మండలంలో 9 ఎంపిటీసీ స్థానాలు ఉంటే 10 ఎంపీటీసీ స్థానాలకు డిక్లరేషన్ ఫారమ్ అది రాత్రి 11 గంటల తర్వాత దుద్యాల -2 టీడీపీ గెలిచినట్లు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రానున్న సర్పంచు ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కలసికట్టుగాపనిచేయాలన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు టీడీపీ పార్టీ మోసాలను, కుట్రలను, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకోని పోవాలన్నారు. ప్రజా సమస్యలు, రైతుల సమస్యలను ప్రజలకు తెలియజెప్పి ఓటు అడగాలన్నారు. టీడీపీకి ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే నైతిక హక్కులేదన్నారు. బెదిరింపులకు ఏ కార్యకర్త బయపడొద్దని, ఓటమి చెందిన అభ్యర్థులు అదైర్య పాడొద్దని పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచిన ఎంపీపీ స్థానాన్ని కూడా కుట్రలతో లాక్కోవాలని చూసిన టీడీపీ నాయకులకు సిగ్గు ఉండాలన్నారు. అధికార మధంతో ఎంపీటీసీ స్థానాలను లాక్కోవడం గెలుపు కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే టీడీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్సీపీ పార్టీ తరపున ప్రతి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు ప్రజల్లో ఉంటూ, ప్రజలకోసం, గ్రామాల అభివృద్ధికోసం పనిచేయాలన్నారు. మరో సారి కొత్తపల్లి మండలం వైఎస్సార్సీపీ అడ్డా అని ప్రజలు నిరుపించారన్నారు. వైఎస్సార్సీపీ అభ్యర్తుల గెలుపుకోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి, మండల ప్రజలకు దన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, సింగారం వెంకట రమణ(రంగ), రహంతుల్లా. శ్రీనివాస రెడ్డి, మహబూబ్ బాషా, బాబురెడ్డి, రవీంద్రా రెడ్డి, ఎ.రవీంద్రా రెడ్డి. మునిరంగ, మహమ్మద్ గౌస్, శివన్న, బాలరాజు, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, సి శ్రీనివాసులు యాదవ్, నాగ ఎల్లయ్య, లింగారెడ్డి, బాల ఎల్లయ్య, అచ్చి రెడ్డి, రామలింగా రెడ్డి, మొల్ల బాషా, నందిశ్వర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లోకేశ్వర రెడ్డి, హుస్సేన్ బాషా, వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాసేవే లక్ష్యం గ్రామ అభివృద్ధే ధ్యేయం!

స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా బరిలో బొమ్మన మద్దిలేటి రెడ్డి



జూపాడు బంగ్లా నవంబర్ 20 (నంది పత్రిక) మండల పరిధిలోని 80 బన్నూరు గ్రామంలో స్వతంత్ర అభివృద్ధిగా సర్పంచ్ ఎన్నికల్లో బొమ్మన మద్దిలేటి రెడ్డి బరిలో నిలిచారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనే ప్రధాన లక్ష్యాలుగా ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆయన తెలిపారు.అధికారం కోసం కాకుండా ఆత్మగౌరవం కోసం, పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం, యువతను ప్రోత్సహించడం, మహిళలకు సముచిత గౌరవం కల్పించడం, వృద్ధులు, పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం తన ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “అధికారం కోసం ఆశపడితే ఏదో ఒక పార్టీ నీడలో ఉండేవాడిని. కానీ ఆత్మగౌరవం కోసం, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగాను“ అని తెలిపారు.ప్రజల ఆశీర్వాదం, సహకారంతో80 బన్నూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ఆకాంక్ష అని బొమ్మన మద్దిలేటి రెడ్డి పేర్కొన్నారు.

శాంతిరాం కళాశాలలో ఫెన్సింగ్ ఎంపిక పోటీలు





నంద్యాల ప్రతినిధి. నవంబర్ 20 . (నంది పత్రిక):స్థానిక నెరవాడ సమీపంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూఏ ఫెన్సింగ్ టీం ఎంపిక పోటీలు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఎన్టీయూఏ పరిధిలోని వివిధ కళాశాల నుండి సుమారుగా బాల బాలికల నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు అని తెలిపారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథి జేఎన్టీయూఏ క్రీడా విభాగం నుండి ప్రొఫెసర్ టి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.అలాగే సెలక్షన్ కమిటీ మెంబర్స్ గా మహేశ్వరరావు మరియు నరేష్ పాల్గొన్నారు.డిసెంబర్ 4 నుండి 12 వరకు యూనివర్సిటీ ఆఫ్ జమ్మూ, జమ్ములో జరిగే ఆల్ ఇండియా ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చంద్ర రెడ్డి మరియు ముని శంకర్ వెంకటేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రొఫెసర్ టి నారాయణ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు యూనివర్సిటీ నుండి క్రీడా దుస్తులు మరియు వారికి అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు .

జెడ్పీటీసీగా ప్రమాణ స్వీకారం చేసిన మాధవరం శాంతకుమారి



జూపాడు బంగ్లా నవంబర్ 20 (నంది పత్రిక) జూపాడు బంగ్లా మండలం జెడ్పిటిసి గా మాధవరం శాంతకుమారి తెలుగుదేశం పార్టీ తరఫున భారీ మెజార్టీతో గెలుపొందారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి శాంతకుమారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని చూసి ప్రజలు నన్ను గెలిపించారని నంద్యాల పార్లమెంటు ఇంచార్జ్ మాంద్ర శివానందరెడ్డి మరియు శాసనసభ్యులు గిత్త జయ సూర్య ఆశీస్సులతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నా గెలుపు కోసం కృషి చేసిన జూపాడుబంగ్లా తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ అభివృద్ధిలో జిల్లా పరిషత్ కీలకం కావాలి







జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిషత్
చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం
నూతన జెడ్పి పాలక వర్గ సభ్యులతో
ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్
ప్రజలకు అందుబాటులో ఉంటూ
అభివృద్ధికి కృషి చేయాలి.. :
జెడ్పీ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 20: నంది పత్రిక గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ కీలకం కావాలని.. ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి, ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి నూతన జెడ్పిటిసి సభ్యులను కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం, జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ వ్యవస్థకు జిల్లాలో ప్రత్యేకమైన చరిత్ర ఉందని, గతంలో పలువురు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు అందించిన సేవలతో ఈ వ్యవస్థకు గుర్తింపు లభించిందన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షించడం, గ్రామాలు, మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం జిల్లా పరిషత్ ప్రధాన బాధ్యతలని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, ఇతర సంస్థలు, మండల పరిషత్‌ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు వాటి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. జిల్లా పరిషత్‌కు వచ్చే ఆదాయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సాగునీరు, పారిశుధ్యం, విద్య వంటి ముఖ్యమైన రంగాలకు వినియోగిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వివి జీ-రామ్-జీ పథకం ద్వారా జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో అవసరమైన పనులను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపాలని, ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలని వివరించారు. ఈ పనుల అమలును జిల్లా పరిషత్ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు ప్రతి సంవత్సరం సుమారు రూ.1,500 కోట్ల నుంచి రూ.1,700 కోట్ల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాలు ఈ రుణాలను ఆర్థిక అభివృద్ధికి వినియోగించుకుంటూ సకాలంలో తిరిగి చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. సంఘాల పనితీరును సమీక్షించడం, వాటి ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించేలా జిల్లా పరిషత్ సభ్యులు చొరవ చూపాలన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, సాంకేతిక రంగం, తాగునీరు తదితర గ్రామీణ అవసరాలకు సంబంధించిన పథకాల అమలుపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా, పారదర్శకంగా అమలు చేయవచ్చన్నారు.ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ కోరారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా పరిషత్ చైర్మన్ లేదా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలాల అభివృద్ధికి కృషి చేయాలి.. : జెడ్పీ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులందరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆయా మండలాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలన్నారు.ప్రధానంగా జిల్లాలో ఎల్నినో ప్రభావాన్ని నియంత్రించే చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా.. ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని నదుల ఆయకట్టు భూములు సాగునీటి కొరతతో ఉన్నాయని... ప్రత్యామ్నాయ సాగునీటి కోసం జిల్లా యంత్రాంగంతో కలిసికట్టుగా ప్రణాళికలు రూపొందిద్దామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక పరిస్థితులను పరిశీలించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, జిల్లా కలెక్టర్ సూచనలు, సహకారంతో గ్రామీణాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాప్రతినిధులందరి సమష్టి కృషితో వైఎస్సార్ కడప జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

జెడ్పి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక సాగిందిలా...

కార్యక్రమంలో ముందుగా... జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ తొలుత నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, నిర్ణీత నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను చేపట్టారు.

జెడ్పి చైర్మన్, పదవికి సంబంధించి వీరనాయునిపల్లె జెడ్పీటీసీ సభ్యుడు పుత్తా నర్సింహారెడ్డి పేరును, వైస్ చైర్మన్ పదవికి పోరుమామిళ్ల జెడ్పీటీసీ సభ్యురాలు హబీబున్నీసా చాంద్‌బాయి పేరును ప్రతిపాదిస్తూ.. జెడ్పిటిసి సభ్యులు ప్రతిపాదనలు చేశారు. ఇతర సభ్యులు ఎవరూ నామినేషన్ చేయకపోవడంతో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పుత్తా నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ గా హబీబున్నీసా చాంద్‌బాయిలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ హబీబున్నీసా చాంద్‌బాయిలతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. భారత రాజ్యాంగంపై నిజమైన నమ్మకం, విధేయత కలిగి ఉంటూ తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తామని వారితో ప్రమాణం చేశారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, మైదు7ఎమ్మె6 పుట్టా సుధకర్ యాదవ్, జిల్లా తెదేపా ఇంఛార్జి భూపేష్ రెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





బండి ఆత్మకూరులో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 20: బండి ఆత్మకూరులో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నాటితో ముగిశాయి. 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 14 నుండి బాలల దినోత్సవం కార్యక్రమంతో వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు నివాళులు అర్పించారు. వ్యాసరచన చిత్రలేఖనము వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. శుక్రవారం నాడు పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేసేందుకుగాను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సుస్మిత బహుమతులను అందజేశారు. వారోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న అధికారులకు బోధినేతర సిబ్బందికి గ్రంథాలయ అధికారి రవిరాజు కృతజ్ఞతలు తెలియజేశారు.



నాలుగు క్లస్టర్లుగా గ్రామపంచాయతీ నామినేషన్లు



జూపాడుబంగ్లా నవంబర్ 20 (నంది పత్రిక) జూపాడు బంగ్లా మండలంలోని 12 గ్రామపంచాయతీలు నాలుగు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి నామినేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డిసెంబర్ రెండున సర్పంచు వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో భాగంగా 80 బన్నూరు, తరిగోపుల, పోతులపాడు, లింగాపురం, క్లస్టర్ గా జూపాడుబంగ్లా, భాస్కర పురం, తాటిపాడు క్లస్టర్ గా, మండ్లెం, తర్తూరు, తంగడంచ క్లస్టర్లుగా, పారుమంచాల, తుడిచెర్ల క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్ కు ఎన్నికల అధికారులను నియమించారు. అని ఎంపీడీవో డి. గోపికృష్ణ తెలిపారు.

కాళికమ్మ దేవాలయంలో ఘనంగా అమ్మవారికి పూజలు



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 20 . (నంది పత్రిక):నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ లో వెలసిన కాళికమ్మ దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించినట్లు దేవాలయం కమిటీ సభ్యులు తెలియజేశారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ కాళికమ్మ దేవాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని శుక్రవారం పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద్ వితరణ చేసామన్నారు. ఆలయ ఈవో లక్ష్మీనారాయణ , చైర్మన్ వసుంధర దేవి , ధర్మకర్తల సహకారలతో ఘనంగా పూజలు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం భక్తులు భారీగా పాల్గొని కాళికమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు..

లోకేశ్వరెడ్డి విజయానికి బీజేపీ నేతల ప్రచారం

కోవెలకుంట్లలో కూటమి అభ్యర్థికి మద్దతుగా అభిరుచి మధు పర్యటన--

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 20 (నంది పత్రిక) కోవెలకుంట్ల పట్టణంలోని వార్డు సభ్యుడిగా కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి లోకేశ్వరెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఆయన విజయానికి బీజేపీ నాయకులు ప్రచారంలో పాల్గొని మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థి తరఫున ప్రజల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆదరణతో లోకేశ్వరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు లింగన్న, మండల అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ అవినాష్ రెడ్డిని పరామర్శించిన రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

పెట్రోల్ బాంబుల దాడిని తీవ్రంగా ఖండించిన రెడ్యం

ఖాజీపేట (నంది పత్రిక) కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డిని రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పరామర్శించి, ఆయనపై జరిగిన దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెట్రోల్ బాంబులు, రాళ్లు, కర్రలతో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, బలపనూరు క్లస్టర్లలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు హైకోర్టు తీర్పు మేరకు నామినేషన్లు వేసేందుకు వీలుగా పోలీస్ స్టేషన్‌కు అభ్యర్థులను అప్పగించేందుకు వెళ్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, చవ్వా దుష్యంత్ రెడ్డి తదితరుల వాహనాలపై శుక్రవారం ఉదయం అంకాలమ్మగూడూరు గ్రామం వద్ద దాడి జరిగినట్లు తెలిపారు. టీడీపీకి చెందిన వ్యక్తులు పెట్రోల్ బాంబులు, రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటన అనంతరం పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డి, చవ్వా దుష్యంత్ రెడ్డి తదితరులను రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు సురేష్ బాబు, పులివెందుల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వై.ఎస్. మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ వేముల మండల పరిశీలకుడు వేల్పుల రాము తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



టీడీపీ పార్టీని వీడి వైఎస్సార్సీపీలోకి చేరిక

-20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్సీపీ గూటికి

కొత్తపల్లి – నంది పత్రిక : సర్పంచు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీని వీడి కార్యకర్తలు, నాయకులు ప్రతి పక్ష వైఎస్సార్సీపీ పార్టీలో చేరుతున్నారు. శుక్రవారం మండలంలో వైఎస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా మండలంలోని దుద్యాల గ్రామంలో టీడీపీ మాజీ ఉప సర్పంచు, టీడీపీ నాయకుడు సుంకరి మన్సూర్ వలే మరో 20 కుటుంబాలతో పాటు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ప్రభుత్వ పనితీరు, ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ ఇన్చార్జీ మాండ్ర శివానంద రెడ్డిల పనితీరుపై అసంతృప్తితో వైఎస్సార్సీపీలో చేరినట్లు మన్సూర్వలీ చెప్పారు. పార్టీ కోసం కష్టపడే వారికి టీడీపీలో విలువలు లేవని అన్నారు. కాగా రానున్న సర్పంచు ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపుకోసం అందరు కలిసికట్టుగా కృషి చేయాలని వారికి బైరెడ్డి సిద్ధా రెడ్డి సూచించారు.





Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్





నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ను ప్రారంభించిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ లో 115 మంది ప్రాజెక్టులు

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 20 (నంది పత్రిక)

నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో డిస్టిక్ లెవెల్ 32 నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా సమన్వయకర్తలు కెవి సుబ్బారెడ్డి, జి నాగేంద్ర కుమారులు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి 115 ప్రాజెక్టులు రిజిస్టర్ చేసుకోగా విద్యార్థులు సుస్థిర అభివృద్ధి కొరకు విజ్ఞాన శాస్త్రము, ఆవిష్కరణలు అనే ప్రధాన అంశంపై ప్రాజెక్టు తయారు చేసి ప్రదర్శించారు. గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమానికి శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి, గోస్పాడు మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల కరీం, సురేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు నేషనల్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు తాము తయారుచేసిన ప్రాజెక్టులను కార్యక్రమంలో ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ సైన్స్ తోనే ప్రపంచం నడుస్తుందని కొత్త ఆవిష్కరణలకు నాంది పలికే సత్తా విద్యార్థులకే ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అత్యాధునిక ప్రయోగాలతో కొత్త తరం సైన్స్ కు బాటలు వేసుకోవాలని తెలియజేశారు. నూతన ప్రయోగాలకు వైపు అడుగులు వేస్తూ కొత్త కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని విద్యార్థులను కోరారు. అనంతరం గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో సైన్స్ పరుగులు పెడుతుందని చెప్పారు. అందులో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందనేందుకు నూతనంగా శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలే నిదర్శనం అవుతాయని తెలిపారు. గోస్పాడు మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లోనే ప్రథమ స్థానంలో ఉంచాలని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు పర్యావరణం మొక్కలు పెంపకం నీటి సంరక్షణ ఇంధనాల కాలుష్యం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయి 32వ జాతీయ బాలల విజ్ఞాన శాస్త్ర కాంగ్రెస్ – 2026 విజేతల వివరాలు ఇలా.. శ్రీ రామదాసు గౌతమి (జిహెచ్ఎస్ ఆత్మకూర్) ప్రాజెక్ట్ చెంచు వంటగది వెనుక దాగి ఉన్న వాస్తవాలు, గోర్లగుట్ల నవనీత్ కుమార్ (ఏపీ మోడల్ స్కూల్, బేతంచెర్ల) ప్రాజెక్ట్ పాఠశాల వ్యర్థాల విభజన నమూనా: తగ్గించడం, పునర్వినియోగించడం మరియు పునరుత్పత్తి చేయడం కోసం ఒక సరళమైన వ్యవస్థ, పి. సరయు రెడ్డి (శ్రీ గురురాజా సీబీఎస్ఈ స్కూల్, నంద్యాల) ప్రాజెక్ట్ వరి వ్యర్థాలను పర్యావరణ అనుకూల పునర్వినియోగ వస్తువులుగా మార్చడం – పొట్టు నుండి ఆశ వరకు, జి. సారా గ్రేస్ రోనియా (గుడ్ షెపర్డ్ ఈఎం స్కూల్, నంద్యాల) ప్రాజెక్ట్ మొబైల్ ఫోన్లు – "సూక్ష్మజీవులకు ఒక రహస్య రహదారి", మన్నెపు రాజేష్ దుడెకుల (జడ్పీహెచ్ఎస్(బి), పీపుల్లీ) ప్రాజెక్టు దోమల నియంత్రణ: ఆరోగ్యకరమైన జీవితం వైపు ఒక అడుగు, పి. లక్ష్మి సాధక (కేంద్రీయ విద్యాలయం టోన్), ప్రాజెక్ట్ కలుషిత ధ్వని శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడం, కమ్మర సహస్ర లక్ష్మి (శాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్, నంద్యాల) ప్రాజెక్ట్ పెడల్ పవర్ జనరేటర్ మానవ శక్తి నుండి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది.





అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో యూజీసీ బృందం సందర్శన



రాజంపేట(నంది పత్రిక ప్రతినిధి)నవంబర్ 20:

రాజంపేట మండలం బోయనపల్లి లోని అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో నవంబర్ 19, 20 తేదీలలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) నిపుణుల బృందం చేపట్టిన సందర్శన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా యూజీసీ బృందం విశ్వవిద్యాలయంలోని విద్యా, పరిపాలనా, పరిశోధనా విభాగాలతో పాటు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఇతర మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించింది. విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం పట్ల కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ఇ. సాయిబాబా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, యూజీసీ నిపుణుల బృందం సందర్శన కార్యక్రమం అన్ని విభాగాల సమన్వయంతో సజావుగా సాగిందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయ వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు పరిశోధనా అవకాశాలను విశ్వవిద్యాలయం కల్పిస్తోందని వివరించారు. విశ్వవిద్యాలయంలోని విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై యూజీసీ బృందం సానుకూలంగా స్పందించడం విశ్వవిద్యాలయానికి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందని అన్నారు.యూజీసీ బృందం సందర్శన విజయవంతంగా ముగియడం విశ్వవిద్యాలయ ప్రగతికి, ఉన్నత విద్యా ప్రమాణాల సాధనకు మరియు భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు చేపడుతున్న కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కమిటీ పరిశీలనలు, సూచనలు విశ్వవిద్యాలయ భవిష్యత్తు అభివృద్ధికి మరింత దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ



తనిఖీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎన్. మల్లికార్జున రావు కీలక పాత్ర పోషించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం సాధిస్తూ, తనిఖీకి సంబంధించిన ఏర్పాట్లు మరియు కార్యక్రమాలను సమర్థవంతంగా పర్యవేక్షించి, సందర్శన విజయవంతం కావడానికి విశేష కృషి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన రిజిస్ట్రార్ డా. ఎన్. మల్లికార్జున రావు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు వివిధ విభాగాల అధికారులను అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డా. సి. గంగి రెడ్డి మరియు ప్రో-ఛాన్సలర్ సి. అభిషేక్ రెడ్డి అభినందించారు.

సర్పంచ్ అభ్యర్థి ముజఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో దద్దరిల్లిన వైసీపీ ప్రచారం

శిరివెళ్ల(నంది పత్రిక) మండల కేంద్రంలో వైసీపీ ప్రచారం అల్లకల్లోలంగా సాగుతూ వైసీపీ అభ్యర్థి నాయక్ ముజఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారానికి భారీగా ప్రజలు పోటెత్తారు.మండల కేంద్రంలోని ప్రతి వీధిలో "ముజఫర్, ముజఫర్" అనే నినాదాలతో మారుమోగిపోతూ, మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముజఫర్ హుస్సేన్ మాట్లాడుతూ శిరివెళ్ల నా సొంత గడ్డ, ఈ గడ్డ మీద పుట్టినోడిని. మీ కష్టాలు నాకు తెలుసు, మీ బాధలు నాకు తెలుసు.అని అభివృద్ధి కోసం నా ప్రాణమైన ఇస్తానని ఆయన అన్నారు.ప్రచారంలో చిన్నా ,పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ముజఫర్ హుస్సేన్ ప్రతి ఇంటికి వెళ్లి, పెద్దలను కలిసి,ప్రజల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు.శిరివెళ్లలో ఈసారి ముజఫర్ హుస్సేన్ గెలుపు ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకుడు అబ్దుల్ సలాం, నజీర్, వసీం, తదితరులు, పాల్గొన్నారు.



శిరివెళ్లలో టీడీపీ ప్రచారం సునామీ-2వ వార్డులో హుస్సేన్ బ్రదర్స్ దూకుడు - ప్రత్యర్థులకు చెమటలు..

శిరివెళ్ల:(నంది పత్రిక) మండల కేంద్రం లో ప్రచారం దద్దరిల్లి, 2వ వార్డులో టీడీపీ ప్రచారం అంటే మామూలు ప్రచారం కాదు, అది ఒక సునామీ. టీడీపీ సర్పంచ్ అభ్యర్థులు మహ్మద్ హుస్సేన్, ఫిదా హుస్సేన్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు.ఉదయం నుంచే 2 వ వార్డులోని ప్రతి గల్లీ, ప్రతి ఇంటికి మహమ్మద్ హుస్సేన్, ఫిదా హుస్సేన్ తలుపు తట్టి మరీ అన్నా, ఎలా ఉన్నారు? అమ్మా, బాగున్నారా? ఏం సమస్య ఉంది? అంటూ ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి పలకరించుకుంటూ ప్రజల కష్టాలు, బాధలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఎక్కడ చూసినా పసుపు జెండాలు, ఎక్కడ విన్నా జై టీడీపీ నినాదాలు, మహిళలు హారతులు పట్టి ఆహ్వానిస్తున్నారు. పెద్దలు ఆశీర్వదించి, మీరే గెలవాలి బిడ్డా అంటూ దీవిస్తున్నారు.ఈ సందర్భంగా మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అభివృద్ధి కోసమే మేము రాజకీయాల్లోకి వచ్చాము అని, పదవి కోసం కాదు, సేవ కోసం వచ్చి,ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే మా లక్ష్యమనరు.ఫిదా హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలే మా బలం, ప్రజల ఆశీర్వాదమే మా గెలుపు. టీడీపీ గెలుపు ఖాయం. ఇది మా గెలుపు కాదు, ప్రజల గెలుపు అని అన్నారు.ప్రచారం చూసిన ప్రజలు, ఇంతవరకు ఏ నాయకుడు ఇలా ఇంటింటికి వచ్చి మా సమస్యలు అడగలేదు, హుస్సేన్ బ్రదర్స్ నిజమైన నాయకులు అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ప్రముఖ వ్యాపారవేత సహనూర్ అనీష్ ఖాన్, షఫీ ఉల్లా, ఎద్దు కరిముల్లా, మున్నా ,షేక్షావలి, యూనిస్ హుస్సేన్, సికిందర్, అబూబకర్ సిద్దిక్, రావుఫ్, వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, యువ నాయకులు, అభిమానులు ప్రచారాన్ని విజయవంతం చేశారు.



పెరుసోములలో బీజేపీ ఎన్నికల శంఖారావం

సాగినెల జగదీశ్వరయ్య, ఇంద్రావతి నామినేషన్



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 20 (నంది పత్రిక) నంద్యాల జిల్లా సంజామల మండలం పెరుసోముల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థులుగా సాగినెల జగదీశ్వరయ్య, సాగినెల ఇంద్రావతి నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామంలో ప్రజల మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు పార్టీ నాయకులు అండగా నిలిచారు.నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ హాజరై అభ్యర్థులకు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు పెద్దన్న, హరికృష్ణ గౌడ్, హరినాథ్ రెడ్డి తదితర నాయకులు పాల్గొని అభ్యర్థులకు సంఘీభావం ప్రకటించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల్లో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. నామినేషన్ కార్యక్రమంతో గ్రామంలో బీజేపీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం నెలకొంది. కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

కళ్యాణ వేడుకల్లో పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందించిన రెడ్యం

ఖాజీపేట (నంది పత్రిక) ప్రొద్దుటూరు/పులివెందుల, నవంబర్ 20: వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం మూడు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని వై.ఎం.ఆర్. కాలనీకి చెందిన రిటైర్డ్ లెక్చరర్ బాగ్యలక్ష్మి మనుమరాలు, ఏపీఎస్ఎన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (నంద్యాల) ఏకైక కుమార్తె రాజలక్ష్మి, జశ్వంత్ పవన్ కుమార్ రెడ్డిల వివాహం ప్రొద్దుటూరులోని శ్రీదేవి ప్యాలెస్‌లో జరిగింది. అలాగే కమలాపురం మండలం తురకపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు లింగాల రాజశేఖర్ రెడ్డి తమ్ముడి కుమార్తె, లింగాల బాల గంగిరెడ్డి చిన్న కుమారుడు శైలేశ్వర రెడ్డి, శశికళల వివాహం ప్రొద్దుటూరు బైపాస్‌లోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న బి.కె.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పులివెందుల మున్సిపల్ మాజీ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ కుమార్తె జాహ్నవి, హర్షిత్ తేజ్‌ల వివాహం పులివెందుల పట్టణంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ మూడు వివాహ వేడుకలకు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారు కలకాలం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షించారు.



కొత్తపల్లి జెడ్పీటీసీగా గూడెం రాజకుమారి ప్రమాణ స్వీకారం



కొత్తపల్లి – నంది పత్రిక : మండల జెడ్పీటీసీ సభ్యురాలిగా గూడెం రాజకుమారి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు మాండ్రా శివానంద రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య బలపరిచిన గూడెం రాజకుమారి జెడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా గూడెం రాజకుమారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జెడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టేందుకు సహకరించిన పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తానని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ప్రజాప్రతినిధిగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. మండలంలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు గూడెం రాజకుమారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

- పీవీఎస్ నాయుడు

కొత్తపల్లి – నంది పత్రిక : పదవ తరగతి ఆపై చదువుకున్న చెంచు గిరిజనులు ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పీవీఎస్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... నంద్యాల మార్కాపురం, పలనాడు జిల్లాలలోని చెంచు గిరిజన గ్రామాలలో 10 వ తరగతి ఆపై చదువుకున్న గిరిజనులందరూ సీడ్ ఏపీ సంస్థ నిర్వహించే 3 నెలలపాటు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ కోర్స్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్లకు సంబంధించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతి యువకులు తమ విద్యార్హత నకలు పత్రాలతో ఎర్రగొండపాలెం వై టి సి నందు సంప్రదించాలని సూచించారు. ఈ శిక్షణలో ఉచిత భోజన వసతి, హాస్టల్ సదుపాయం, ఉచిత యూనిఫామ్, అలాగే స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. చెంచు గిరిజనులందరూ ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 73822 12 899 నంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవర్చుకోవాలి - ఎం.ఈ.ఓ నారాయణ రావు

రాజంపేట (నంది పత్రిక ప్రతినిధి)నవంబర్ 20: విద్యార్థులు చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎం.ఈ.ఓ నారాయణ రావు తెలిపారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం గ్రంథాలయ అధికారి రవి శంకర్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రాజంపేట మండల విద్యా శాఖ అధికారి నారాయణ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనము అలవాటును అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తకాలే మనకు నిజమైన మార్గదర్శకులని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ మరియు శ్లోకాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వై.నంద కిశోర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, ప్రతి విద్యార్థి రోజూ కొంత సమయం పుస్తకాలు చదవడానికి కేటాయించాలని కోరారు.మన్నూరు జెడ్పి హైస్కూల్ ఇంచార్జి హెచ్.ఎం శారద, కింగ్స్ బ్రిడ్జి స్కూల్ కరెస్పాన్డెంట్ శుభాష్ మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, అచ్యుత, శ్రీధర్, పి.ఈ.టి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పతకాలు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



జడ్పీటీసీ దేవనబండ వైష్ణవి యాదవ్‌కు ఘన సన్మానం

ఖాజీపేట: (నంది పత్రిక) వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండల జడ్పీటీసీ సభ్యురాలు దేవనబండ వైష్ణవి యాదవ్‌ను ఖాజీపేట మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) పల్లె నీరజ తో పాటు 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ



సందర్భంగా వైష్ణవి యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించనున్న దేవరబండ వైష్ణవి యాదవ్ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు.జడ్పీటీసీ దేవనబండ వైష్ణవి యాదవ్ మాట్లాడుతూ తనను ఘనంగా సన్మానించిన ఎంపీపీ యాదవ్ నీరజతో పాటు 14 మంది ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి జడ్పీటీసీగా ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఖాజీపేట మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదవ్ నీరజతో పాటు ఖాజీపేట మండలానికి చెందిన 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఖాజీపేట మండలానికి చెందిన నాయకులు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగసముద్రంలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థి దివ్యకు మద్దతుగా ఎం పీ పీ పెట్లు కుమారి ఇంటింటి ప్రచారం



పోరుమామిళ్ల, నవంబర్ 20(నంది పత్రిక): వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థి దాసరిపల్లె దివ్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్య నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు బద్వేల్ నియోజకవర్గ యువ నాయకులు చెరుకూరి రవినాయుడు, చెరుకూరి చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రచారం కొనసాగింది.ఈ సందర్భంగా పోరుమామిళ్ల,(ఎం పీ పీ) పెట్లు కుమారి రహమత్ నగర్, గిరినగర్, టీచర్స్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి దాసరిపల్లె దివ్యకు మద్దతుగా ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం పూర్తి.. వెలుగోడులో వేడెక్కిన పంచాయతీ పోరు!



వెలుగోడు, నవంబర్ 20 (నంది పత్రిక): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఇరుపార్టీల మధ్య రాజీ ప్రయత్నాలు ఫలించకపోతే ఇక హోరాహోరీ పోరు తప్పేలా లేదు.

నామినేషన్ల వివరాలు ఇలా.. వెలుగోడు మండల పరిధిలో మొత్తం 8 గ్రామ పంచాయతీలు ఉండగా, నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 18, వార్డులకు 56 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ గంధం మురారి వెల్లడించారు. మొత్తం మూడు రోజుల్లో సర్పంచ్ పదవులకు 50, వార్డు సభ్యులకు 238 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన పేర్కొన్నారు.

మూడు ఏకగ్రీవం.. ఐదు చోట్ల పోటీ? మండలంలోని రేగడగూడూరు, వేల్పనూరు, బోయరేవుల పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు వెలుగోడు, గుంతకందాల, అబ్దుల్లాపురం, మోత్కూరు, మాధవరం పంచాయతీల్లో ఎన్నికల సమరం జరిగే సూచనలు ఉన్నాయి.

మేజర్ పంచాయతీలో త్రిముఖ పోరు కీలకమైన వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రచార జోరు పెంచారు. టీడీపీ మద్దతుదారుడు డాక్టర్ జాకీర్ హుస్సేన్ సతీమణి బన్నూరు మునవర్, వైఎస్ఆర్‌సీపీ బలపరిచిన అభ్యర్థి లాయర్ ఆషిఫ్ మరదలు రెహానా పర్వీన్, ఎస్‌డీపీఐ మద్దతుతో హుస్సేన్ భాష భార్య షేక్ జబీనా గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే ఎక్కడ ఏకగ్రీవం, ఎక్కడ పోటీ అనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

పోరుమామిళ్లలో కళ్యాణి ఫిజియో కేర్ క్లినిక్ ప్రారంభం క్లినిక్‌ను ప్రారంభించిన చిత్తా సునంద రెడ్డి..



హాజరైన మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల, నవంబర్ 20 (నంది పత్రిక): వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న ఆర్‌సీఎం కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కళ్యాణి ఫిజియో కేర్ క్లినిక్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీ వుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి సతీమణి చిత్తా సునంద రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి క్లినిక్‌ను ప్రారంభించి ప్రజలకు ఫిజియోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి క్లినిక్‌ను సందర్శించి, ఫిజియోథెరపీ సేవలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు.డాక్టర్ ఎన్. నిఖిల్ కళ్యాణ్ కుమార్ (బీపీటీ, బీపీఈడీ), ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో ఈ క్లినిక్‌లో వివిధ రకాల ఫిజియోథెరపీ చికిత్సలను అందించనున్నారు. శరీర నొప్పులను తగ్గించడం, కదలికలను మెరుగుపరచడం, కండరాల బలాన్ని పెంచడం, గాయాల నుంచి కోలుకోవడం, శస్త్రచికిత్స అనంతరం పునరావాసం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. మెడ నొప్పి, భుజం నొప్పి, నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులు, మోచేయి నొప్పి, చేతులు, మణికట్టు సమస్యలు, కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, క్రీడా గాయాలు, పక్షవాతం అనంతర పునరావాసం, శరీర భంగిమలో లోపాలు వంటి సమస్యలకు చికిత్స అందించనున్నారు.వ్యాయామ చికిత్స, ఎలక్ట్రోథెరపీ



(టీఈఎన్ఎస్, ఐఎఫ్‌టీ, అల్ట్రాసౌండ్), మాన్యువల్ థెరపీ, అవసరమైనప్పుడు డ్రై నీడ్లింగ్, కైనిసియో టేపింగ్, హాట్ అండ్ కోల్డ్ థెరపీ వంటి ఆధునిక చికిత్సా విధానాలను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా క్లినిక్ నిర్వాహకులు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నొప్పులు, కదలికల సమస్యలతో బాధపడేవారు ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 7842703717 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పచ్చదనం ఉట్టిపడేలా నగర రూపురేఖలు

నగర ప్రవేశ మార్గాలు పచ్చదనంతో కళకళలాడాలి

ప్రతి డివైడర్‌లో పచ్చగడ్డి నాటి పచ్చదనం పెంపొందించాలి

డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు, రంగులు వేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు సిటీ నందిపత్రిక నగరంలో పచ్చదనం ఉట్టిపడేలా, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ నగర రూపురేఖలను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హార్టికల్చర్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో కలిసి కంట్రోల్ రూమ్, కొండారెడ్డి బురుజు, కిడ్స్ వరల్డ్ సర్కిల్, రాజ్‌విహార్ నుంచి పుల్లారెడ్డి కాలేజీ వరకు, నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ వరకు, బిర్లా కాంపౌండ్, చౌరస్తా ప్రాంతాల్లోని డివైడర్లు, సెంట్రల్ మీడియన్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్ది, పచ్చదనం, సుందరీకరణలో ఆదర్శంగా నిలిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌క్యాప్ జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం) నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, నగరంలోకి ప్రవేశించే నంద్యాల, నందికొట్కూరు, పెద్దపాడు మార్గాలను పచ్చదనంతో కళకళలాడేలా అభివృద్ధి చేయాలన్నారు. డివైడర్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, పెయింటింగ్ వేయించాలని, పచ్చగడ్డి, మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హార్టికల్చర్ పనుల నిర్వహణకు అవసరమైన ట్రాక్టర్, అదనపు సిబ్బంది, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడీ ప్రతాప్ రెడ్డి, డీఈఈ కృష్ణలత తదితరులు పాల్గొన్నారు.

రూ. 3.5 లక్షల విలువైన సెంట్రింగ్ షీట్స్ దొంగల అరెస్ట్

నాల్గవ పట్టణ సీఐ విక్రమ సింహా

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు పట్టణం వీకర్ సెక్షన్ కాలనీ లో బిల్డర్ మోహన్ నిర్మిస్తున్న ఇంటిలో స్లాబ్ పనుల కోసం పెట్టి ఉంచిన సెంట్రింగ్ షీట్స్ సుమారు 320 వరకు గుర్తు తెలియని వ్యక్తులు గత వారం దొంగతనం చేశారు అని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు పరచి, ధర్యాప్తులో భాగంగా నేర



స్థలం నుండి అందుబాటులోని సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించగా ముగ్గురు యువకులు ఒక ఎలక్ట్రిక్ ఆటో లో వాటిని తరలిస్తున్నట్టు గమనించి, ట్రాక్ చేస్తూ విచారణ లో

1) మహమ్మద్ తండ్రి పేరు రజాక్ ఖాన్ వయస్సు 21 ఎన్టీఆర్ బిల్లింగ్

2)కాజా తండ్రి పేరు మక్బుల్ భాష వయసు 28 సంతోష్ నగర్

3).రఫీ తండ్రి పేరు చాంద్ భాషా వయస్సు 27 ఎన్టీఆర్ బిల్లింగ్

4) పఠాన్ రిహాన్ అలీ ఖాన్ తండ్రి పేరు పఠాన్ ప్రజా ఖాన్ వయసు 19, ఎన్టీఆర్ బిల్డింగ్ 5) షేక్ షాహిద్ తండ్రి పేరు షేక్ హసన్ భాష వయసు 20 ఎన్టీఆర్ బిల్డింగ్ అను 5 మంది తమ జల్సాలకు గాను సదరు సెంట్రింగ్ షీట్లను దొంగతనం చేసి

కోడుమూరు రోడ్ నందు గల గుజిరి షాపుల నందు విక్రయించునట్టు అంగీకరించడం తో సదరు నిందితులను అరెస్ట్ చేసి, సదరు దొంగతనం చేయబడ్డ మొత్తం సెంట్రింగ్ షీట్ లను మరియు దొంగతనానికి ఉపయోగించిన ఆటో లను సీజ్ చేయడం జరిగింది..సదరు నిందితులు అందరి మీద సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేసి వీరి కదలికలపై నిఘా ఉంచడం జరుగుతుంది.

పెద్ద టేకూరులో శ్రీ శబరి అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవం

గ్రామ ప్రజల కోరిక మేరకు ఆలయాన్ని పూర్తి చేసిన అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కే అశోక్ వర్ధన్ రెడ్డి





కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెదటేకూరు గ్రామంలో గత 17 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న శ్రీ శబరి అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె అశోక్ వర్ధన్ రెడ్డి చొరవతో పూర్తయింది. ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని గ్రామ ప్రజలు ఆయనను కోరగా వారి అభ్యర్థనకు స్పందించి ముందుకు వచ్చి నిర్మాణ పనులను పూర్తి చేయించారు. దీంతో గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరి అయ్యప్ప స్వామి ఆలయం భక్తుల దర్శనానికి సిద్ధమైంది. గ్రామ ప్రజల భక్తి భావానికి, వారి ఆకాంక్షకు గౌరవం ఇస్తూ కె అశోక్ వర్ధన్ రెడ్డి ఈ పవిత్ర కార్యాన్ని చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమాజానికి ఉపయోగపడే ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఆయన తీసుకున్న చొరవ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించడంతోపాటు గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలవనుంది. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నవంబర్ 20వ తేదీన ఆలయ ప్రారంభోత్సవం, స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురుస్వామి కాంతారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కె అశోక్ వర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు గ్రామ ప్రజలకు, అయ్యప్ప స్వామి భక్తులకు హృదయపూర్వక ఆహ్వానం పలుకుతూ, ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన భక్తులు, దాతలు, గ్రామ ప్రజలకు కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది. పెదటేకూరులో పూర్తయిన శబరి అయ్యప్ప స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తూ గ్రామంలో భక్తి భావాన్ని మరింత పెంపొందించనుంది.

నంద్యాల జడ్పీ నూతన చైర్మన్ కు మంత్రి అభినందనలు

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన జడ్పి చైర్మన్



బనగానపల్లె నవంబర్ 20 నందిపత్రిక నంద్యాల జిల్లా పరిషద్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నిక కాబడిన షేక్ బృహనుద్దీన్ శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ని ఆయన క్యాంపు కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి తనకు పదవి అప్పగించినందుకు మంత్రికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బృహానుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో జడ్పీ చైర్మన్‌గా కీలక పాత్ర పోషించాలి.. మంత్రి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని నూతన జడ్పి చైర్మన్ కు మంత్రి జనార్దన్ రెడ్డి సూచించారు.

టీడీపీ నాయకుడు ఉమ్మడి ఆది హుస్సేన్ రెడ్డి మృతి

పార్థివ దేహానికి నివాళులర్పించిన బీసీ ఇందిరా రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి

బనగానపల్లె, నవంబర్ 20 నందిపత్రిక అవుకు మండలం గుండ్లసింగవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉమ్మడి ఆది హుస్సేన్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి శుక్రవారం వారి స్వగృహానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు నివాళి అర్పించారు.



గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగింపు!

జడ్పీహెచ్ స్కూల్ లో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

సిరివెళ్ల నవంబర్ 20:లి(నంది పత్రిక) గ్రంథాలయ వారోత్సవాల చివరి రోజు సందర్భంగా యర్రగుంట్ల జడ్పీహెచ్ స్కూల్ లో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హెడ్ మాస్టర్ గోవిందరాజు సార్‌అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ టీచర్స్, మోడల్ స్కూల్ టీచర్స్, ఎంపీపీ ఉర్దూ స్కూల్ టీచర్స్, రిటైర్డ్ ఎంఈఓ మహబూషా సార్, జడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ మేడం తెహరున్ బి, జడ్పీహెచ్ స్కూల్ లైబ్రేరియన్ మహమ్మద్ రఫీ సార్, డ్రాయింగ్ మేడం అరుణ గారు, విద్యార్థులు పాల్గొన్నారు.వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వక్తృత్వ పోటీలో షఫియా, హుస్సేన్ బివ్యాసరచనలో సుహానా, ఈశ్వరి, ఫయాజ్‌ఉర్దూ వ్యాసరచనలో ఉమ్మీ కౌసర్, తస్లిమ్, ఫర్హాత్బేతిరాత లేఖనంలో యూసుఫ్, కౌసల్య, తాషిఫ్ఎంపీపీ ఉర్దూ గర్ల్స్ & బాయ్స్ స్కూల్ మ్యూజికల్ ఛైర్స్ లో: సానియా, అస్మా, దిల్షాద్, ఫజిలత్‌విజేతలందరికీ గ్రంథాలయం తరపున అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు.గ్రంథాలయ వారోత్సవాలకు సహకారం అందించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈరోజుతో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయని గ్రంథాలయ అధికారిణి కె. సుజాత తెలియజేశారు.



జడ్పిటిసి సభ్యుడుగా పోరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 20 నంది పత్రిక నంద్యాల జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది అనంతరం ఆళ్లగడ్డ జడ్పిటిసిగా గెలుపొందిన పోరెడ్డి రాజశేఖర్ రెడ్డి జడ్పిటిసిగా సభ్యుడిగా జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి జి రాజకుమారి స్వీకారం చేయించారు భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసము విధేయత కలిగి



ఉంటూ తమకు అప్పగించిన తమకు అప్పగించిన బాధ్యతలను నిష్ఠతో నిర్వహిస్తామని జడ్పిటిసి పోరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రమాణము చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు ఏకగ్రీవ ఎన్నిక





జిల్లా పరిషత్ ఉప చైర్మన్‌గా సిరగాని నాగేశ్వరరావు ఎన్నిక.

జిల్లా పరిషత్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ

పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా పరిషత్ ఉప చైర్మన్‌గా సిరగాని నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 20 నంది పత్రిక

జిల్లా పరిషత్ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులతో శుక్రవారం భీమవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధ్యక్షత వహించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.

జిల్లా పరిషత్ సభ్యుల ప్రమాణ స్వీకారం సమావేశం ప్రారంభంలో నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులందరితో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు తమ బాధ్యతలను నిబద్ధతతో, ప్రజాసేవే లక్ష్యంగా నిర్వహిస్తామని ప్రమాణం చేశారు.

చైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు ఏకగ్రీవ ఎన్నిక.

అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, చైర్మన్ పదవికి ఇందుకూరి రామకృష్ణంరాజు పేరును సభ్యులు ప్రతిపాదించి, ఇతర సభ్యులు బలపరిచారు. ఈ పదవికి మరే ఇతర నామినేషన్ లేకపోవడంతో ఇందుకూరి రామకృష్ణంరాజు జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజుతో ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉప చైర్మన్‌గా సిరగాని నాగేశ్వరరావు ఎన్నిక.

జిల్లా పరిషత్ ఉప చైర్మన్ పదవికి నిర్వహించిన ఎన్నికల్లో సిరగాని నాగేశ్వరరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఉప చైర్మన్‌లకు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా పరిషత్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

నూతన చైర్మన్‌కు ప్రజాప్రతినిధుల అభినందనలు

జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన ఇందుకూరి రామకృష్ణంరాజును ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. నాగరాజు, పలువురు జిల్లా పరిషత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఉప చైర్మన్‌లు మాట్లాడుతూ జిల్లా పరిషత్ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల సమగ్ర ప్రగతికి, ప్రజల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు.

ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు నవ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమణ, జిల్లా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1. అడ్డాల శ్రీసత్య నరసాపురం జనసేన పార్టీ
2. కత్తుల సిరి మహాలక్ష్మీ భీమవరం జనసేన పార్టీ
3. కొడవటి నాగలక్షి యలమంచిలి జనసేన పార్టీ
4. చలుమూరి చంద్రశేఖర్ పెనుగొండ తెలుగుదేశం పార్టీ 5. చింతపల్లి వెంకట దుర్గ వీరవాసరం తెలుగుదేశం పార్టీ 6. చింతలపాటి శివనాగరాజు పాలకోడేరు తెలుగుదేశం పార్టీ
7. తనబుద్ధి రవి కిరణ్ పెంటపాడు జనసేన పార్టీ
8. దాసరి మిస్సమ్మ పోడూరు తెలుగుదేశం పార్టీ
9. నేకూరి కిరణ్ కుమార్ తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ
10. నౌకట్ల వెంకటలక్ష్మి ఆకివీడు తెలుగుదేశం పార్టీ
11. పంపన మహాలక్ష్మి ఇరగవరం భారతీయ జనతా పార్టీ12. పెన్మెత్స వెంకట లక్ష్మి నరసింహరాజు ఉండి జనసేన పార్టీ13. బీరా నరసింహమూర్తి ఆచంట తెలుగుదేశం పార్టీ14. మట్టా వెంకటేశ్వర రావు తణుకు తెలుగుదేశం పార్టీ 15. మేకా గీతా మహాలక్ష్మి కాళ్ళ జనసేన పార్టీ16. మేడిది ఉషారాణి పాలకొల్లు తెలుగుదేశం పార్టీ 17. యిందుకూరి రామ కృష్ణం రాజు గణపవరం తెలుగుదేశం పార్టీ 18. లోకం నాగలక్ష్మి మొగల్తూరు తెలుగుదేశం పార్టీ
19. వెలగల బుల్లి రామిరెడ్డి పెనుమంట్ర తెలుగుదేశం పార్టీ
20.శిరగాని నాగేశ్వర రావు అత్తిలి తెలుగుదేశం పార్టీ









ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించి.. జిల్లా పరిషత్ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ ప్రజాప్రతినిధులు

ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలే మార్గదర్శకాలు.. ప్రజాసేవ, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేయాలి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 11:30 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోనల్-5 ఇన్‌చార్జ్ పి. శ్రీనివాస రెడ్డి, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, శాసనసభ్యులు కేఈ శ్యామ్ కుమార్, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి, వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవ్ కుమార్, ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి కైపా పద్మలత రెడ్డి, విక్రమ్ సింగ్, కప్పట్రాళ్ల బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న ఉల్లిగయ్య, వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న సాదిక షేక్ పాటు నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులందరూ కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మహానేత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మధ్యాహ్నం 12:15 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాప్రతినిధులందరూ ప్రజాసేవకు అంకితం కావాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



జడ్పీటీసీ ప్రమాణ స్వీకారానికి ముందు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన తెలుగు దేశం ప్రజా ప్రతినిధులు

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ జెడ్పిటిసి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమము ముందుగా శుక్రవారం అనగా తేదీ 20.112026న ఉదయం 11.30 నిముషములకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంనకు ఎన్నికైనటువంటి సభ్యులందరూ శాసనసభ్యులు నియోజకవర్గం ఇన్చార్జీలు పార్టీ ముఖ్య నాయకులు చేరుకోవడం జరిగినది. జిల్లా పార్టీ కార్యాలయము నందు పార్టీ పార్లమెంటు అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన పార్టీ జోనల్ 5 ఇంచార్జ్ పెళ్లకూరు శ్రీనివాస్ రెడ్డి,పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి నాగరాజు యాదవ్ కర్నూలు పార్లమెంటు సభ్య లు బస్తిపాటి నాగరాజ్ శాసనసభ్యులు కేఈ శ్యాం కుమార్, బొగ్గుల దస్తగిరి డాక్టర్ బి.వి జయ నాగేశ్వరెడ్డి మంత్రాలయం ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి వైకుంఠం జ్యోతి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవ్ కుమార్ ప్రభాకర్ రాష్ట్ర కార్యదర్శి కైపా పద్మలత రెడ్డి విక్రమ్ సింగ్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్లు సంద్యాల నాగేంద్ర, ఎల్.వి.ప్రసాద్, పోతురాజు రవికుమార్ తో పాటు చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయనున్న చూడు ఉల్లిగయ్య వైస్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేయ మన్న సాదిక షేక్ తో పాటు ఇటీవల ఎన్నికైన జడ్పిటిసి సభ్యులంతా కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారకరామారావు కి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 12 గంటల 15 నిమిషములకు జిల్లా పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్నటువంటి ఎన్టీ రామారావు విగ్రహం దగ్గరకు చేరుకొని అక్కడ కీర్తిశేషులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం నాయకులు జిల్లా పరిషత్ కార్యాలయమునకు చేరుకోవడం జరిగింది.



విద్యార్థులకు దీర్ఘకాలిక క్రిమిసంహారక దోమతెరల పంపిణీ



సిరివెళ్ల (నంది పత్రిక)సిరివెళ్ల మండలంలోని స్థానిక మోడల్ స్కూల్ మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచనల మేరకు డాక్టర్ ముకేశ్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక క్రిమిసంహారక దోమతెరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, ఫైలేరియా,మెదడువాపు వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రభుత్వ ఆరోగ్యశాఖలు దీర్ఘకాలిక క్రిమిసంహారక దోమతెరలను సిఫార్సు చేస్తున్నాయని తెలిపారు. సాధారణ దోమతెరలు కేవలం దోమలు లోపలికి రాకుండా అడ్డుకుంటాయని, ఎల్ఎల్ఐఎన్ (ఐ×చీ) దోమతెరల తయారీలోనే క్రిమిసంహారక మందును కలపడం వల్ల దోమలు వాటిపై వాలినప్పుడు దూరంగా వెళ్లిపోవడం లేదా నశించడం జరుగుతుందని వివరించారు. ఇవి దోమలకు భౌతిక అడ్డుకట్టగా ఉండటమే కాకుండా పరిసరాల్లో దోమల సాంద్రతను తగ్గించడంలో కూడా సహాయపడతాయని పేర్కొన్నారు.

దోమతెరల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

కొత్త దోమతెర ప్యాకెట్‌ను తెరిచిన వెంటనే ఉపయోగించకుండా 24 గంటల పాటు నీడలో గాలికి ఆరబెట్టాలని సూచించారు. దోమతెర మరీ మురికిగా అయినప్పుడు మాత్రమే మూడు నెలలకు ఒకసారి చల్లని నీటిలో సాధారణ సబ్బుతో సున్నితంగా ఉతకాలని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్,వేడినీటిని ఉపయోగించకూడదని, బ్రష్‌తో గట్టిగా రుద్దకూడదని సూచించారు. వీటికి మళ్లీ మళ్లీ క్రిమిసంహారక రసాయనాలు పూయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.అనంతరం సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా ఎల్ఎల్ఐఎన్ దోమతెరలను వినియోగించడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. జ్వరాల కారణంగా విద్యార్థులు చదువుకు, ఆటపాటలకు దూరమవడమే కాకుండా ఏకాగ్రత లోపించడం, ఇతరులకు వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్యలను నివారించడానికి ప్రతి ఒక్కరూ క్రిమిసంహారక దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇస్రాత్ బేగం,కేజీబీవీ ప్రిన్సిపాల్ రమాదేవి,సూపర్వైజర్లు రవికిషోర్,కిరణ్,మౌలాలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల జడ్పీటీసి సభ్యుడు పోలూరు విజయ రాఘవ రావు ప్రమాణ స్వీకారం



బేతంచెర్ల నవంబర్ 20 (నందిపత్రిక). నంద్యాల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బేతంచర్ల మండల జెడ్పీటీసీగా పోలూరు విజయ రాఘవ రావు (పోలూరు రాఘవ రెడ్డి) శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన జెడ్పీటీసీ సభ్యులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బేతంచర్ల మండలాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని డోన్ ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

బండి ఆత్మకూరు పెట్రోల్ బంకుల్లో వసతుల లేమి



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 20 : బండి ఆత్మకూరు లోని ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ పద్మావతమ్మకు వినతిపత్రం అందజేశారు. బంకుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి నింపే సదుపాయం, డిజిటల్ చెల్లింపుల సౌకర్యాలు అందుబాటులో లేవని, పెట్రోల్, డీజిల్ కొరతతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పూల వెంకట సుబ్బన్న, పాలుట్ల సురేష్ , పూల విజయకుమార్, దూదేకుల అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల సర్పంచ్ అభ్యర్థిగా కూటమి అభ్యర్థి లక్ష్మి నాగేంద్ర బాబు నామినేషన్



కోవెలకుంట్లనవంబర్ 20నందిపత్రిక కోవెలకుంట్ల మేజర్ గ్రామపంచాయతీకి కూటమి బలపరిచిన అభ్యర్థి కరిమద్దెల లక్ష్మి నాగేంద్ర బాబు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, కరిమద్దెల మురళి, శేఖర్, గడ్డం అమర్నాథరెడ్డి, చెన్న కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో నిఖిల్ సాయి మెమోరియల్ స్కూల్ లెవెల్ 11-ఏ -సైడ్ హాకీ టోర్నమెంట్



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా హాకీ అఫ్ఫాక్ కమిటీ సహకారంతో రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ (రిజిస్టర్డ్), కర్నూలు మరియు అక్సా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 23, 2026న కర్నూలులోని యస్టీబీసీ హాకీ గ్రౌండ్‌లో నిఖిల్ సాయి మెమోరియల్ స్కూల్ లెవెల్ హాకీ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌ను 11-ఏ -సైడ్ విధానంలో బాలురు మరియు బాలికలకు విడివిడిగా నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థుల్లో హాకీ క్రీడపై ఆసక్తిని పెంపొందించడం, పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కావున కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు తమ పాఠశాల బాలుర, బాలికల హాకీ జట్లను ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.పూర్తి వివరాలకు క్లబ్ ప్రసిడెంట్ మదాసి కురువ భరత్ కుమార్, జవశ్రీశ్రీ: 97040 36703 ఫోన్ హాకీ జట్లు పేర్లు నమోదు చేసుకోవాలని పత్రిక ప్రకటన చేశారు.





నామినేషన్ల జోరు .. అభ్యర్థుల హుషారు

బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 20: గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం శుక్రవారం నాటికి చివరి రోజుకు చేరుకుంది. గ్రామాలలో సర్పంచ్లు అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు, వార్డు సభ్యులు తమ జోరును పెంచారు. ప్రారంభంలో నామినేషన్ల పర్వం మందకొండిగా సాగినప్పటికీ చివరి రోజు ఊపందుకుంది. బండి ఆత్మకూరు మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు నామినేషన్ లు వేసేందుకు ఉత్సాహం కనపరిచారు. అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు తమ నామినేషన్లను పరిశీలించుకుని మరి పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. గెలుపు ఓటముల కు కీలకం వార్డు సభ్యులే కావడంతో, వారిని క్లస్టర్లకు తీసుకొని వచ్చి మరి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాయకులు వారితో నామినేషన్లను వేయించారు. పార్టీలకు రహితంగా ఈ ఎన్నికలు జరగబోతున్నప్పటికీ, తెలుగుదేశం, వైయస్సార్ పార్టీలకు చెందిన నాయకులు పోటీలు పడి నామినేషన్లను దాఖలు చేశారు. గత రెండు రోజులుగా 20 గ్రామ పంచాయతీ పరిధిలో 23 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవులకు, 224 మంది వార్డులకు తమ నామినేషన్ లను ఎన్నికల అధికారులకు సమర్పించుకున్నారు. ఈర్నపాడు క్లస్టర్ పరిధిలో ఈర్నెపాడు గ్రామపంచాయతీకి మూడు కడమల కాల్వ పంచాయతీకి రెండు వెంగల్రెడ్డిపేట గ్రామపంచాయతీకి ఐదు చొప్పున సర్పంచ్ పదవులకు పలువురు నామినేషన్లను వేశారు. సర్పంచి పదవులకు సంబంధించి ఏ కోడూరులో 11, బి కోడూరులో 8 ,బండి ఆత్మకూరులో 16 ,భోజనంలో ఐదు ,చిన్నదేవలాపురంలో తొమ్మిది, లింగాపురంలో 4, జి సి పాలెం లో 8 ,కాకనూరులో ఆరు, నారాయణపురంలో 9 , పర మటూరులో ఐదు ,పార్నపల్లెలో 6 ,పెద్దదేవలాపురంలో 10 , సంతజూ టూర్లో పది, రామాపురంలో 8 ,సింగవరంలో 10 , సోమాయాజుల పల్లెలో 8, ఎర్రగుంట్లలో 10 ,చొప్పున సర్పంచ్ పదవులకు నామినేషన్లను దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి గాయత్రి పేర్కొన్నారు. 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 457 మంది సభ్యులు వార్డులకు నామినేషన్లను దాఖలు చేశారని పేర్కొన్నారు.



గోకులపాడు సర్పంచ్ అభ్యర్థిగా సింగం హేమ సుందర్ రెడ్డి నామినేషన్



కర్నూల్ సిటీ నంది పత్రిక కల్లూరు మండలం గోకులపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం మద్దతుదారులు సింగం హేమ సుందర్ రెడ్డి నామినేషన్ వేశారు. కార్యక్రమంలో బిజెపి టిడిపి నాయకులు సింగం సోమశేఖర్ రెడ్డి, లక్ష్మీ వరధారెడ్డి సోమేశ్వర ఆచారి మహేశ్వర్ రెడ్డి డి రఘునాథరెడ్డి రామాంజనేయులు సుధాకర్ సి శంకరయ్య గిడ్డయ్య ఎం రఘునాథరెడ్డి నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు

చిన్నటేకూరు సర్పంచ్ స్థానానికి కురువ శేషమ్మ నామినేషన్ కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి వైఎస్ఆర్సిపి మద్దతుదారులుగా కురువ శేషమ్మ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కే పెద్ద ఈశ్వరయ్య కె నారాయణ శ్రీరాములు నక్క స్వాములు లక్ష్మన్న భాష తదితరులు పాల్గొన్నారు

ముగిసిన నామినేషన్ల కార్యక్రమం కల్లూరు మండలంలోని ఏడు ఎన్నికల కస్టర్ల నందు చివరి రోజు సర్పంచ్ స్థానానికి 38 మంది, వార్డు మెంబర్ల స్థానాలకు 76 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో మండలంలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు మొత్తం 94 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు వార్డు స్థానాలకు మొత్తం 413 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారని అధికారులు తెలిపారు . మండలంలోని 7 ఎన్నికల క్లస్టర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు



ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు.. ఏవో బి. కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా నవంబర్ 20 (నంది పత్రిక) మండల కేంద్రంలోని రైతు ఉత్పద్దార్ల సంఘం కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పై ఏవో బి కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఏవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు తనస్మార్ట్ ఫోన్లో ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోని రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఎరువులను



యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు, అందుబాటులో ఉండే ఎరువులను డీలర్లను ఎంచుకునే విధానము కూడా ఉంటుంది. బుక్ చేసుకున్న వెంటనే రైతులకు క్యూఆర్ కోడ్ జెనరేట్ బుక్ చేసుకున్న బస్తాలకు క్యూఆర్ కోడ్ చూపించను, రైతులు ఎరువుల డీలర్ దగ్గరికి వెళ్లి ఎరువులు తీసుకోవచ్చని అన్నారు. క్యూఆర్ కోడ్ రెండు రోజులు మాత్రమే పని చేస్తుంది. రైతులకు బుక్ చేసుకునే విధానం తెలియకపోతే డీలర్స్ మరియు ఆర్ ఎస్ కె సహాయకుల సహాయం తీసుకోవాలని తెలియజేశారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కరించాలి.

కనీస వేతనాలు, పీఎఫ్, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలి.
సీఐటీయూ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడాలి.



ఆదోని నంది పత్రిక ప్రతినిధి ప్రైవేట్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రైవేట్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఆదోని రెవెన్యూ డివిజన్ సమావేశం జిల్లా నాయకులు శేషాద్రి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. రామాంజనేయులు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సీఐటీయూ కార్యదర్శి తిప్పన్న, సహాయ కార్యదర్శి లక్ష్మన్న, యూనియన్ జిల్లా నాయకులు బసవరాజు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్కు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పీఎఫ్, పెన్షన్ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు.అలాగే బోనస్, వారాంతపు సెలవులు, జాతీయ సెలవు దినాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలవెన్సులు, డీఏ, ప్రయాణ ఖర్చులు తదితర హక్కులను సాధించుకునేందుకు మెడికల్ రిప్రజెంటేటివ్స్ అందరూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐకమత్యమే ప్రధాన బలమని, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉద్యమించాలని నాయకులు సూచించారు. పాత కార్మిక చట్టాల అమలు కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ కన్వీనర్ వెంకటేష్తో పాటు సాబీర్, ఖాజా, మల్లేష్, మల్లికార్జున, నాగరాజు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూకుడు పెంచిన సర్పంచ్ అభ్యర్థి తిమ్మసముద్రం పల్లవి



రాజంపేట (నందిపత్రిక ప్రతినిధి) నవంబర్ 20: రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి పల్లవి ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు, గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుస్తూ తనకు మద్దతుగా నిలవాలని, సర్పంచిగా అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.గతంలో పల్లవి భర్త సమ్మెట శివప్రసాద్ సర్పంచి గా పనిచేసిన సమయంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, గత పాలనలో చేసిన పనులను గుర్తు చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి తాము చేసిన కృషిని ప్రజల ముందుంచి, మరోసారి తమ కుటుంబానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామంలో సమస్యలను పరిష్కరించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయడమే తమ లక్ష్యమని ప్రచారంలో వివరిస్తున్నారు. ప్రజల ఆదరణ, ఆశీర్వాదంతో సర్పంచిగా ఎన్నికైతే నాగిరెడ్డిపల్లి అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పల్లవి హామీ ఇస్తూ ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారు.

జెడ్పీటీసిల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం మరియు జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక చేసిన కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు.జిల్లా పరిధిలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులు జిల్లా పరిషత్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవికి కౌతాళం జడ్పీటీసీ సభ్యుడు చూడి ఉలిగయ్య, వైస్ చైర్మన్గా దేవనకొండ మండలం జడ్పిటిసి సభ్యురాలు డా.సాధికా షేక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ లకు, జడ్పీటీసీ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీ నాగరాజు , పత్తికొండ ఎమ్మెల్యే కె ఇ శ్యాంబాబు , ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు

రబీ పంటలకు రైతులు బీమా చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి



కర్నూలు సిటీ నంది పత్రిక రబీ సీజన్లో రైతులు సాగుచేసిన పంటలకు భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఫ్రెమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్స్ డిస్ట్రిబ్యూషన్ (రైతులకు నేరుగా ఎరువుల పంపిణి)కార్యక్రమం పై రైతులకుఅవగాహన కలిపించారు. ఎఫ్ ఎస్ ఎస్ యాప్ నందు రైతు రిజిస్ట్రేషన్ చేసుకొని క్యూ ఆర్ కోడ్ ద్వారా ఎరువుల కొనుగోలు చేసుకొనే విధానము గురించి ఎఫ్ ఎస్ యాప్ లో చూపించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ ఐడి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు రబీ పంటకు సంబంధించి పంట భీమా ప్రీమియము వివరాలు ఒక ఎకరాకు జొన్న రూ 297, శనగ రూ 420, ఉల్లి రూ 1350, వేరుశనగ రూ 480, పి ఎం ఎఫ్ బి వై బీమా ప్రీమియం డిసెంబర్ 15 వ తేదీ లోగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

అట్టహాసంగా టీడీపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

200 మంది కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ
విజయమే లక్ష్యంగా కదలివచ్చిన పసుపు దండు



వెలుగోడు, నవంబర్ 20 నంది పత్రిక:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ శుక్రవారం అత్యంత కోలాహలంగా జరిగింది. టీడీపీ నేత డాక్టర్ జాకీర్ హుస్సేన్ సతీమణి బన్నూరు మునవర్ సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు ముందుగా గ్రామంలో దాదాపు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ప్రదర్శనగా మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు.పసుపు కండువాలు ధరించి, పార్టీ జెండాలతో కార్యకర్తలు చేసిన నినాదాలతో మార్మోగాయి. అనంతరం ముఖ్య నాయకులతో కలిసి ఎన్నికల అధికారికి బన్నూరు మునవర్ నామినేషన్ పత్రాలను అందజేశారు. వెలుగోడు గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని ఈ సందర్భంగా డాక్టర్ జాకీర్ హుస్సేన్, పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

పుస్తక పఠనంతో పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహులు

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 20, నంది పత్రిక పుస్తక పఠనంతో పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని శాఖ గ్రంధాలయం లో 59వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గ్రంధాలయ శాఖ అధికారిని అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేషలింగం పంతులు చెప్పిన మాటలను గుర్తు చేసుకోవాలన్నారు. మంచి పుస్తకం పఠనం చేయడం ద్వారా పరిజ్ఞానం పెరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం వారోత్సవాలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు గ్రంధాలయ అధికారిని అరుణకుమారి బహుమతులు ప్రధానం చేశారు.



అభివృద్ధి పనులకు మరో ముందడుగు

18 వార్డు అభివృద్ధే మన లక్ష్యం
18 వ వార్డు కార్పొరేటర్ అంబిలి కాశీ విశ్వనాథ్



కర్నూల్ సిటీ నందిపత్రిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు టి.జి. భరత్ గుప్తా ఆదేశాల మేరకు, కర్నూలు బుధవారపేటలోని 18 వ వార్డ్ లో, లక్ష్మీనివాస్ హోటల్ పక్కన ఉన్న సందులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగింది.గత స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే మంత్రి సహకారంతో ఈ రోడ్డు పనులు మంజూరు కాగా, ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో ప్రారంభించలేకపోయాము. ఎన్నికల అనంతరం చేపడుతున్న తొలి అభివృద్ధి పనిగా ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించడం సంతోషకరం.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. రామాంజనేయులు , వార్డు ఇంచార్జ్ బి. క్రాంతి కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు నర్సింహులు, మాలిక్, బూత్ ఇంచార్జులు రంగా, అనిల్ సింగ్, బాలు, అమర్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

శ్రీశైలం దేవస్థానంలోవైభవంగా కోటి దీపోత్సవం





శ్రీశైలం నవంబరు20(నంది పత్రిక) కార్తీకమాసోత్సవాల సందర్భంగా (20.11.2026) దేవస్థానం కోటిదీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా సంప్రదాయబద్దంగా నిర్వహించిందని ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగమపాఠశాల ఎదురుగా గల మైదానంలో సాయంత్రం గం. 4.30ల నుంచి ఈ కోటిదీపోత్సవశీ మొదలైనదన్నారు. ఇందుకోసం కైలాస పర్వత నమూనాలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా ఈ కార్యక్రమములో ముందుగా కోటిదీపోత్సవ ప్రత్యేకతను, దీపారాధన విశేషాలను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డా. హయాగ్రీవాచార్యుల వారిచే నిర్వహించబడిందన్నారు.అదేవిధంగా కోటిదీపోత్సవ వేదికపై సాయంత్రం గం.7.00ల నుంచి శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషపూజలు, కోటిదీపోత్సవం జరిపించబడిందన్నారు.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు దశవిధహారతులుగా ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి సమర్పించబడిందన్నారు.కాగా కార్యక్రమాల అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ జరిపించబడిందన్నారు.

ఘనంగా భక్తి సంగీత స్వరార్చన కోటిదీపోత్సవ కార్యక్రమములో భాగంగా ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకులు శ్రీ మనో గారి బృందంచే భక్తి సంగీత స్వరార్చన కార్యక్రమము ఘనంగా నిర్వహించబడిందన్నారు.

ఈ కార్యక్రమములో ముందుగా వాతాపి గణపతిం భజే అంటూ గణపతి స్తుతితో ఆరంభించి ఓంకార నాదాను, జయ జయ మహాదేవ నీల కంధర, మహాప్రాణ దీపం మొదలైన సినీ భక్తి గీతాలను, శివ సంబంధిత అష్టకాలను, స్తోత్రాలను ఆలపించారన్నారు. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, అర్చక స్వాములు, వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి.

భూ రికార్డుల్లో తప్పులు, డేటా వ్యత్యాసాలకు తావులేకుండా చర్యలు.

రైతుల సందేహాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: జేసీ నూరుల్ ఖమర్.



ఆదోని నంది పత్రిక ప్రతినిధి రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఆదోని మండలంలోని చిన్న పెండేకల్ గ్రామంలో శుక్రవారం రీసర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ (జీటీ) ప్రక్రియలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆదోని ఆర్డీఓ కె. అరుణ దేవి, తహసీల్దార్ ఏ. వేణుగోపాల్‌తో కలిసి గ్రామంలో పర్యటించిన జేసీ.. గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీ ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. రైతులకు నోటీసుల జారీ, రీసర్వేకు సంబంధించిన అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ రైతులతో జేసీ ముఖాముఖిగా మాట్లాడారు. ఈ-కేవైసీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సందేహాలు, నోటీసుల జారీ తదితర అంశాలపై రైతుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి సందేహాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.భూముల వివరాలు, సర్వే రికార్డులు, సంబంధిత డేటాను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు, పొరపాట్లు, వ్యత్యాసాలకు అవకాశం లేకుండా ఖచ్చితమైన డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ప్రతి రైతుకు ఈ-కేవైసీ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.నోటీసుల జారీ, తదుపరి చర్యలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని, రీసర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ నూరుల్ ఖమర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. అరుణ దేవి, తహసీల్దార్ ఏ. వేణుగోపాల్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.







మహానంది మండలంలో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పర్వం

13 గ్రామాల పరిధిలో మొత్తం 463 నమోదు..



మహానంది, నవంబర్ 20 (నంది పత్రిక):-మహానంది మండలంలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 13 గ్రామాలకు సంబంధించిన గత మూడు రోజులకు మండల వ్యాప్తంగా మొత్తం 463 నమోదు కాగా, ఇందులో సర్పంచ్ 106, వార్డు మెంబర్లు 357 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో మహబూబ్ దౌలా తెలిపారు.

మండలంలో అత్యధికంగా గాజులపల్లెలో 64 సర్పంచ్-10, వార్డు -54) ,ఆ తర్వాత స్థానాల్లో గోపవరం 43 (10, 33), బుక్కాపురం 40 (14, 26) ఉన్నాయి. అత్యల్పంగా నందిపల్లెలో 24 (07, 17) నమోదయ్యాయన్నారు.

మసీదుపురం : 06 – 31 (మొత్తం: 37)
తమ్మడపల్లె : 13 – 24 (మొత్తం: 37)
వి. బొల్లవరం : 11 – 24 (మొత్తం: 35)
ఆర్.ఎస్. గాజులపల్లె : 05 – 30 (మొత్తం: 35)
మహానంది : 08 – 26 (మొత్తం: 34)
తిమ్మాపురం : 06 – 26 (మొత్తం: 32)
అబ్బిపురం : 07 – 23 (మొత్తం: 30)
సీతారామపురం : 04 – 22 (మొత్తం: 26)
అల్లినగరం : 05 – 21 (మొత్తం: 26)



దాఖలు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్సై శివాంజల్ ప్రతిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మహానంది మండలంలో జోరుగా నామినేషన్ల పర్వం...

నేడు 222 నామినేషన్లు దాఖలు...



మహానంది నవంబర్ 20 (నంది పత్రిక) :- మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో శుక్రవారం సర్పంచ్ మరియు వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగింది.మండల వ్యాప్తంగా చివరి రోజు సర్పంచ్ పదవులకు 58, వార్డు సభ్యుల స్థానాలకు 164 చొప్పున మొత్తం 222 నామినేషన్లు దాఖలయ్యాయి.

గ్రామాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలు (సర్పంచ్ / వార్డులు / మొత్తం):

గాజులపల్లి: 08 / 31 (మొత్తం: 39)
తమ్మడపల్లి: 11 / 18 (మొత్తం: 29)
బుక్కాపురం: 11 / 18 (మొత్తం: 29)
మహానంది: 02 / 26 (మొత్తం: 28)
అబ్బిపురం: 05 / 21 (మొత్తం: 26)
తిమ్మాపురం: 04 / 19 (మొత్తం: 23)
అల్లినగరం: 03 / 12 (మొత్తం: 15)
ఆర్.ఎస్. గాజులపల్లి: 02 / 13 (మొత్తం: 15)
యు. బొల్లవరం: 06 / 03 (మొత్తం: 09)
మసీదుపురం: 02 / 01 (మొత్తం: 03)
సీతారాంపురం: 01 / 02 (మొత్తం: 03)
గోపవరం: 02 / 00 (మొత్తం: 02)
నందిపల్లి: 01 / 00 (మొత్తం: 01)

మండలంలో అత్యధికంగా గాజులపల్లి పంచాయతీలో 39 నామినేషన్లు దాఖలు కాగా, తమ్మడపల్లి, బుక్కాపురం పంచాయతీలలో సర్పంచ్ పదవికి అత్యధికంగా 11 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.



విల్లివలం శ్రీమద్ అళగియసింగర్ శతమాన తిరునక్షత్ర మహోత్సవం



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 20, నంది పత్రిక శ్రీ అహోబిల మఠం 45వ పీఠాధిపతులైన పరమపూజ్య శ్రీ విల్లివలం శ్రీమద్ అళగియసింగర్ స్వామి 100వ తిరునక్షత్ర మహోత్సవం శుక్రవారం దిగువ అహోబిలంలో భక్తిశ్రద్ధలతో మంగళాశాసన కార్యక్రమం నిర్వహించారు. పవిత్రమైన ప్రబోధిని ఏకాదశి (దేవుత్థాన ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకొని, శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారికి విశేష తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, లోకకల్యాణం, సర్వజన సుఖశాంతులు, భక్తుల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. పరమపూజ్య శ్రీమద్ అళగియసింగర్ స్వామివారి ఆధ్యాత్మిక సేవలు, దివ్య అనుగ్రహం, భక్తి, జ్ఞానం మరియు మార్గదర్శకత్వం భక్తులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.



కిడ్నాపైన ఎంపీటీసీ ఆచూకీ కోసం పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్ఆర్సీపీ ఆందోళన

ఉయ్యాలవాడ నవంబర్ 20, నంది పత్రిక ఉయ్యాలవాడ మండల పరిధిలోని పెద్దయమ్మనూరు గ్రామ ఎంపీటీసీ తలారి వెంకట రాముడు కిడ్నాప్ అయి 48 గంటలు గడుస్తున్నా పోలీసులు ఆచూకీని కనుగొనకపోవడంపై వైఎస్ఆర్సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ భార్య లక్ష్మీదేవితో పాటు మండల వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.







అట్టహాసంగా టీడీపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

200 మంది కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ

విజయమే లక్ష్యంగా కదలివచ్చిన పసుపు దండు



ఎమ్మిగనూరు నవంబర్ 20 నంది పత్రిక: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బనవాసి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ శుక్రవారం జరిగింది. టీడీపీ నేత కురువ ధనంజయ సతీమణి కురువ జయలక్ష్మి సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు ముందుగా గ్రామంలో దాదాపు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పసుపు కండువాలు ధరించి కార్యకర్తలు నాయకులతో కలిసి ఎన్నికల అధికారికి కురువ జయలక్ష్మి నామినేషన్ పత్రాలను అందజేశారు. బనవాసి గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని ఈ సందర్భంగా కురువ ధనంజయ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

యర్రగుంట్లలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి రిహానా బేగం దంపతులు ప్రచారం జోరు!

ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులు



సిరివెళ్లనవంబర్ 20:(నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులు బరిలో నిలిచారు. ఆమె ప్రచారం రోజురోజుకు జోరు అందుకుంటోంది.ఈరోజు గ్రామంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి రిహానా బేగం ముజాహిద్ దంపతులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి పెద్దలను, మహిళలను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. “యర్రగుంట్ల అభివృద్ధే నా లక్ష్యం. గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరిస్తా. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తా“ అని రిహానా బేగం గారు హామీ ఇచ్చారు.ప్రచారంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. గ్రామంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ జెండాలు, రిహానా బేగం దంపతులు గారికి మద్దతుగా నినాదాలు మారుమోగాయి. గ్రామ అభివృద్ధికి, మహిళా సాధికారతకు తమ ఓటు వేసి గెలిపించాలని ప్రచారంలో కోరారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించాలి





సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనేలా విద్యార్థులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశలి

ఎం.కె. బేగ్ మునిసిపల్ హైస్కూల్‌లో 32వ జాతీయ బాలల విజ్ఞాన శాస్త్ర కాంగ్రెస్ నిర్వహణ

- ఐదు విభిన్న అంశాలపై 135 ప్రాజెక్టుల ప్రదర్శన

- రాష్ట్రస్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్టులు ఎంపిక

- ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేసిన కలెక్టర్

విజయవాడ బ్యూరో చీఫ్ నవంబర్ 20 నంది పత్రిక

అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె. బేగ్ మునిసిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ జాతీయ బాలల విజ్ఞాన శాస్త్ర కాంగ్రెస్‌లో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, పుస్తకాల ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయిస్తూ సమాజంలోని సమస్యలకు నూతన పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం ప్రయత్నించాలని తెలిపారు.“మీలో ప్రతి ఒక్కరిలో ఒక శాస్త్రవేత్త దాగి ఉన్నారు. మీ ఆలోచనలే రేపటి ఆవిష్కరణలకు పునాదులు. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని, శాస్త్రీయ దృక్పథంతో దేశ అభివృద్ధికి తోడ్పడే ఉత్తమ పౌరులుగా ఎదగాలి” అని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.ఈ విజ్ఞాన శాస్త్ర కాంగ్రెస్‌లో ఐదు విభిన్న అంశాల ఆధారంగా విద్యార్థులు రూపొందించిన 135 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 135 మంది మార్గదర్శక ఉపాధ్యాయులు, 10 మంది విషయ నిపుణులు, ఆరుగురు న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు. ప్రాజెక్టులను వాటి సృజనాత్మకత, శాస్త్రీయత, సామాజిక ప్రయోజనాల ఆధారంగా మూల్యాంకనం చేశారు. మొత్తం 135 ప్రాజెక్టుల నుంచి ఏడు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు.మార్కులకే పరిమితం కాకుండా పరిశోధనా దృక్పథం అలవర్చుకోవాలి: జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్. చంద్రకళ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా శాస్త్రీయ ఆలోచన, పరిశోధనా దృక్పథం, నూతన ఆవిష్కరణలతో సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. అప్ కాస్ట్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ మైనం హుస్సేన్ ప్రాజెక్టుల ప్రదర్శన, మూల్యాంకన విధానాలను వివరించారు. జిల్లా సైన్స్ అధికారి పిచ్చేశ్వరరావు విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించడంలో జాతీయ బాలల విజ్ఞాన శాస్త్ర కాంగ్రెస్ ప్రాధాన్యతను వివరించారు. ఎన్టీఆర్ జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ అర్బన్ ఉప విద్యాశాఖాధికారి పి.సాంబశివరావు, విజయవాడ నార్త్ మండల విద్యాశాఖాధికారులు తడవర్తి శ్యాంప్రసాద్, బాణావత్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కడపలో గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సు



కడప నవంబర్ 20 (నంది పత్రిక రిపోర్టర్)కడప పట్టణం చిన్న చౌక్ లోని ఔషధ భవనంలో, కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సూచన మేరకు, ప్రథమ చికిత్స కేంద్రాల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎ. రమణయ్య ఆధ్వర్యంలో కడప జిల్లా గ్రామీణ వైద్య సోదరుల అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ, గ్రామీణ వైద్య సోదరులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, తమ పరిధిని దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంఘం అధ్యక్షులు రమ ణయ్య మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ బెదిరించే వాళ్ళు తయారయ్యారని, తప్పు చేయకపోయినా దబాయించడానికి ఇచ్చే ఫిర్యాదులను పరిగణలోకి తీసుకోకుండా సహృ దయంతో పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ని కోరారు.జిల్లా అధికారులకు గ్రామీణ వైద్యులు పూర్తిగా సహకరిస్తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో గ్రామీణ వైద్య సోదరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 20 నంది పత్రిక భీమవరం గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందుతాయని ఆమె అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం తగ్గించి, వారిలో పఠనాసక్తిని పెంచే విజ్ఞానదాయకమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పుస్తకాలు చదివే అలవాటును చిన్ననాటి నుంచే పెంపొందిస్తే విద్యార్థుల మేధో వికాసంతో పాటు వివిధ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, క్విజ్ కాంపిటీషన్, ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్, డాన్స్ కాంపిటీషన్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 180 మంది విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ బహుమతులు, అవార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘువీర్ విష్ణు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ సెక్రెటరీ ఎస్ ఎం శేఖర్ బాబు, ఎమ్మార్వో రవిబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అల్లూరి నరసింహారాజు, సభ్యులు వివిఎన్ మూర్తి, గ్రంథాలయ శాఖ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ భవాని, మానవతా సంస్థ సభ్యులు కే గోపాల శర్మ, కుమార వెంకటేశ్వర వరప్రసాద్, సిక్కిని స్కూల్ కరస్పాండెంట్ జ్యోతి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 4,336 నామినేషన్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

సర్పంచ్ పదవులకు 1,079, వార్డు సభ్యుల పదవులకు 3,257 నామినేషన్లు



కడప బ్యూరో చీఫ్, నవంబర్ 20: నంది పత్రిక వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మూడు రోజుల పాటు 13 మండలాల్లో జరిగిన నామినేషన్ల స్వీకరణలో మొత్తం 4,336 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో సర్పంచ్ పదవులకు 1,079, వార్డు సభ్యుల పదవులకు 3,257 నామినేషన్లు వచ్చినట్లు వెల్లడించారు.నవంబర్ 18న మొదటి రోజు సర్పంచ్ పదవులకు 366, వార్డు సభ్యుల పదవులకు 765 కలిపి మొత్తం 1,131 నామినేషన్లు దాఖలయ్యాయి. నవంబర్ 19న రెండో రోజు సర్పంచ్ పదవులకు 425, వార్డు సభ్యుల పదవులకు 1,354 కలిపి 1,779 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజైన నవంబర్ 20న సర్పంచ్ పదవులకు 288, వార్డు సభ్యుల పదవులకు 1,138 కలిపి 1,426 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ వివరించారు.మండలాల వారీగా చివరి రోజు సర్పంచ్ పదవులకు చక్రాయపేటలో 38, వి.ఎన్.పల్లిలో 31, లింగాలలో 30, సింహాద్రిపురంలో 26, సి.కె.దిన్నెలో 25, చెన్నూరులో 25, వేములలో 23, వేంపల్లిలో 22, పెండ్లిమర్రిలో 17, వల్లూరులో 16, కమలాపురంలో 14, తొండూరులో 11, పులివెందులలో 10 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.వార్డు సభ్యుల పదవులకు వి.ఎన్.పల్లిలో 135, చక్రాయపేటలో 127, లింగాలలో 123, సి.కె.దిన్నెలో 118, కమలాపురంలో 112, పెండ్లిమర్రిలో 94, వల్లూరులో 83, చెన్నూరులో 76, సింహాద్రిపురంలో 76, వేంపల్లిలో 70, తొండూరులో 48, పులివెందులలో 39, వేములలో 37 నామినేషన్లు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.నామినేషన్ల పరిశీలన నవంబర్ 21న నిర్వహించనున్నట్లు, పరిశీలనలో తిరస్కరణకు గురైన నామినేషన్లపై నవంబర్ 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అప్పీళ్ల పరిష్కారం నవంబర్ 23న జరుగుతుందని, నవంబర్ 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా పరిషత్‌లో కూటమి ఐక్యతకు ప్రతీకగా నూతన నాయకత్వం.

చైర్‌పర్సన్‌గా కోట పుల్లమ్మ.. వైస్ చైర్మన్‌గా నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల) ఎన్నిక

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నూతన బాధ్యతలు చేపట్టిన నేతలకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ బ్యూరో చీఫ్, 20 నంది పత్రిక. ఎన్టీఆర్ జిల్లా పరిషత్‌లో ఎన్డీఏ కూటమి నూతన నాయకత్వం కొలువుదీరింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గంపలగూడెం మండలానికి చెందిన కోట పుల్లమ్మ ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎన్డీఏ కూటమి నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల) ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ అనంతరం ఇరువురూ నూతన బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ కోట పుల్లమ్మ వైస్ చైర్మన్ నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల) ని అభినందించి, వారి నూతన ప్రస్థానం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

కూటమి సమన్వయానికి మరో నిదర్శనం జిల్లా పరిషత్‌లో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకులకు కీలక బాధ్యతలు దక్కడం ఎన్డీఏ కూటమి మధ్య ఉన్న పరస్పర విశ్వాసానికి, ఐక్యతకు, సమన్వయానికి ప్రతిబింబంగా నిలిచింది. కూటమి భాగస్వామ్య పక్షాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతున్న నాయకత్వానికి ఈ ఎన్నికలు మరో నిదర్శనంగా నిలిచాయి. నూతన నాయకత్వం బాధ్యతలు చేపట్టడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

గ్రామీణ అభివృద్ధికి కొత్త ఊతం.. జిల్లా పరిషత్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు చురుకైన పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీల నాయకులు, కూటమి ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు అభినందనలు తెలిపారు



మార్కాపురం జిల్లా ప్రజా పరిషత్ (జడ్‌పిపి) చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు మరియు ప్రమాణ స్వీకారోత్సవం ప్రశాంత వాతావరణంలో పూర్తి: జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత.



కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ అధ్యక్షత.

21 జెడ్‌పిటిసి, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ లతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్, ప్రొసీడింగ్ అధికారి.

జిల్లా ప్రజా పరిషత్ తొలి చైర్‌పర్సన్ గా కందుల రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గా జి.వి. శ్రీనివాస వర్మ.

మార్కాపురం, బ్యూరో చీఫ్ నవంబర్ 20. నంది పత్రిక మార్కాపురం జిల్లా ప్రజా పరిషత్ (జడ్‌పిపి) చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు (పరోక్ష) మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఎం. విజయ సునీత తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించి, ఎలాంటి లోపాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశామని ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఎం. విజయ సునీతతో పాటు జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఎం.పి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ముత్తముల అశోక్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ పదవి ఓసీ – జనరల్ కేటాయింపునకు రిజర్వ్ చేయబడింది. ముందుగా 21 జెడ్‌పిటిసి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక మరియు ప్రమాణ స్వీకార ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం మార్కాపురం జిల్లా ప్రజా పరిషత్ తొలి చైర్‌పర్సన్ (కందుల రామిరెడ్డి) మరియు వైస్ చైర్‌పర్సన్ (జి.వి. శ్రీనివాస వర్మ)తో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణ స్వీకారం పూర్తి చేయించారు. ఈ సభా ప్రాంగణంలో వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యుల సమక్షంలో నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ కందుల రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జి.వి. శ్రీనివాస వర్మల ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ గంగవరపు జోసెఫ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సుజాత, జిల్లా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డ్రగ్స్‌పై దండయాత్రతో విప్లవాత్మక మార్పులు





- విశేష ఫలితాలిచ్చిన త్రిశూల వ్యూహం, ప్రత్యేక కార్యక్రమాలు

- 2025లో 137 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదుకాగా ఈ ఏడాది 52 కేసులు నమోదు

- గంజాయి బ్యాచ్ లేదు, బ్లేడ్ బ్యాచ్ లేదు.. జిల్లాలో మాదకద్రవ్యాలకు చోటులేదు

- వాస్తవ సమాచారమిస్తే నగదు బహుమతితో సత్కారం

- సమష్టి కృషితో విస్తృతంగా పరీక్షల నిర్వహణ

- మాదకద్రవ్య రహిత జిల్లాపై ప్రజల్లో భరోసా కల్పించేందుకే

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు

విజయవాడ బ్యూరో చీఫ్ నవంబర్ 20 నంది పత్రిక

జీవితాలను ఛిద్రంచేసే మాదకద్రవ్యాల మహమ్మారిపై ఎన్‌టీఆర్ జిల్లాలో ఉక్కుపాదం మోపుతున్నామని.. మాదకద్రవ్యాల నియంత్రణ, నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నషా ముక్త్ భారత్ అభియాన్, ఎన్‌కార్డ్ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, డీసీపీ కేజీవీ సరిత, ఈగల్ డీసీపీ వి.వేణగోపాలరెడ్డి, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.కామరాజుతో పాటు ఈగల్, విద్య, వైద్య ఆరోగ్యం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు, ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర 2.0, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు నిర్వహించిన సర్వే ఫలితాలు, ఈగల్ సమన్వయంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు తదితరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీసీపీ సరిత వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సమష్టి కృషి, నిరంతర పర్యవేక్షణ, విస్తృత తనిఖీలు, ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని.. ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. 149 హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టామని, మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా చూస్తున్నామన్నారు. 2025లో 137 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మాదకద్రవ్యాల రహిత ఎన్‌టీఆర్ జిల్లాను నిర్మించి, యువతకు సురక్షితమైన భవిష్యత్తును అందించడంతో పాటు ప్రజల్లో భరోసా కల్పించడమే లక్ష్యంగా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

శాస్త్రీయ దృక్పథంతో అడుగులు: పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు

శాస్త్రీయ దృక్పథంతో, ఆధునిక విధానాలను అనుసరిస్తూ మాదకద్రవ్యాల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, సరఫరా వ్యవస్థలను గుర్తించేందుకు సమాచార ఆధారిత నిఘా, విస్తృత తనిఖీలు, నిరంతర పర్యవేక్షణతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమష్టి కార్యాచరణ ద్వారా మాదకద్రవ్య రహిత జిల్లాను సాధించేందుకు కృషిచేస్తున్నామని స్పష్టం చేశారు. 42 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ కేసులు పెట్టామని.. మాదకద్రవ్య కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు నిరంతరం ప్రత్యేక చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో భరోసా కల్పించేందుకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని.. త్వరలో ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లకు కూడా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు జిల్లాలో ఏమాత్రం చోటు లేదని.. గంజాయి బ్యాచ్ లేదు.. బ్లేడ్ బ్యాచ్ లేదని, ఎవరైనా వాస్తవ సమాచారమిస్తే నగదు బహుమతితో సత్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో సురక్షితమైన సామాజిక వాతావరణాన్ని నెలకొల్పడం ప్రతిఒక్కరి బాధ్యత అని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈగల్ విభాగం, పోలీస్ శాఖతో పాటు వివిధ సమన్వయ శాఖల క్రియాశీల భాగస్వామ్యం, సమష్టి కృషితో జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా, వినియోగంపై సమర్థవంతంగా నియంత్రణ సాధించగలిగామని తెలిపారు. శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, నిరంతర నిఘా, విస్తృత తనిఖీల ద్వారా మాదకద్రవ్యాల కార్యకలాపాలకు కళ్లెం వేయగలిగామని.. భవిష్యత్తులోనూ ఇదే సమన్వయంతో మరింత పటిష్టంగా చర్యలు కొనసాగిస్తూ మాదకద్రవ్య రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను కొనసాగించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. 1972 హెల్ప్‌లైన్‌తో వచ్చే సమాచారాన్ని వేగంగా విశ్లేషించి, సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. సమావేశంలో ఈగల్ సీఐ ఎం.రవీంద్ర, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో ఎ.శ్రావణ బాబు, అరవ రమేష్ (ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్), డాక్టర్ టి.ఎస్.రావు (ఆకర్ష ఫౌండేషన్), మత్తె అనిల్ (హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ) తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తోన్న ద్రవ్యోల్బణం



ప్రస్తుతం మన దేశంలో ధరలు మండిపోతున్నాయి. ప్రజలను ద్రవ్యోల్బణం వణికిస్తోంది. రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం, భరింపదగ్గ గరిష్ఠ పరిమితిని దాటి రెండేళ్ల రికార్డుగా ఇది నమోదైంది. నిత్యావసరాల వినియోగ ధరల సూచీ ననుసరించి లెక్కించే ద్రవ్యోల్బణం 6శాతం కన్నా పెరిగితే రిజర్వు బ్యాంకు ఆందోళనకర స్థితిగా గుర్తిస్తుంది. తగిన చర్యలకు ఉపక్రమిస్తుంది. అయితే ఇప్పుడు అది 6.09శాతంగా నమోదైంది. ఈ స్థితికి కారణం అందరూ కొనాల్సిన ఆహార దినుసులు, నూనెలు, పాలు తదితర నిత్యావసరాల ధరలు పెరిగిపోవడం. సాధారణ జీవనం సాగించడం మరింత ఖరీదైన వ్యవహారం కావడం. నేరుగా ప్రజా జీవనాన్ని ప్రభావితం చేస్తున్న ఈ ద్రవ్యోల్బణం ప్రజలు ఆర్థికంగా ఎంత కష్టంలో ఉన్నారో తెలియజేస్తున్నది. అందుకనే రిజర్వు బ్యాంకు అప్రమత్తమై, తన పరిధిలోని చికిత్సా చర్యలు చేపడుతోంది. అదేమిటంటే వడ్డీ రేట్లు (రెపో) పెంచడం. అయితే ఇలా పెంచడం గత నెలలోనే జరిగింది. ఒకేసారి 25 బేస్ పాయింట్లు పెంచింది. మళ్లీ ఇప్పుడు పెంచితే అది ప్రజల మీద అదనపు భారమవుతుంది. నగదు చలామణీ తగ్గించడం ద్వారా కొనుగోళ్లను అదుపుచేసి డిమాండ్ తగ్గించడం ఒక పరిధి మేరకే పనికొచ్చే మంత్రం. పరిధి దాటితే వికటిస్తుంది కాబట్టి ప్రభుత్వం రిజర్వు బ్యాంకు దారిని పక్కనపెట్టి, మిగతా దారులు వెతకాలి. ప్రతికూల వాతావరణం వల్ల బియ్యం, పప్పుల వంటి ఆహార దినుసుల దిగుబడి తగ్గి, ధరలు పెరిగాయి. బఫర్ నిల్వలు రిలీజ్ చెయ్యడం, మార్కెట్లో ధరలను అమాంతం పెంచకుండా చూడడం లాంటి చర్యలు చేపట్టాలి. ఆహార ద్రవ్యోల్బణం దక్షిణ భారతదేశంలో ఎక్కువగా ఉందని, అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రథమ స్థానంలో ఉందని లెక్కలు చెబుతున్నాయి. వరుసగా వస్తోన్న తుపానులు అదనపు కష్టాన్ని తెచ్చినట్లున్నాయి. ఈ కష్టకాలంలో ధరలను అదుపు చెయ్యకపోతే పోషకాహార లేమి సమస్య ఎక్కువవుతుంది. అది మిగతా జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుంది. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోణంలో ఆలోచించి చేయదగ్గ ఉపశమన కార్యక్రమాలన్నీ చేపట్టాలి. కేవలం బ్యాంకు కోణంలో ఆలోచించి వడ్డీ రేట్లు పెంపు వంటివి చేపడితే ప్రజలకు కష్టనష్టాలు తప్పవు.

సర్' రద్దు ఒక్కటే పరిష్కారం

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, 13.37 కోట్ల పౌరుల ఓట్లను తొలగించిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్)ను రద్దు చేయాలని, 2023 డిసెంబర్‌లో చేసిన 'ఎన్నికల కమిషనర్ల ఎంపిక, సర్వీసు నిబంధనల చట్టం'ను ప్రజాస్వామ్యీకరించాలని ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ అక్టోబర్ 2న ముంబయిలో పెద్ద ర్యాలీ నిర్వహించింది. అదే రోజు వామపక్ష, ప్రజాతంత్ర విద్యార్థి, యువజన సంఘాలు ఢిల్లీలో గొప్ప నిరసన ప్రదర్శన చేశాయి. ఆ ప్రదర్శనల్లో పాల్గొన్నవారు తీవ్రమైన నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఇండియా కూటమి ప్రదర్శనలను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం శతవిధాలా యత్నించింది. వివిధ రాష్ట్రాల్లో, వివిధ స్థాయిల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి, జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈ విషయాలపై తగినంత స్పందన కనిపించడం లేదు.బిహార్ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో 'సర్'ను భారత ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. తరువాత బెంగాల్‌కు, తదుపరి మొత్తం అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించింది. ఈ సర్ ప్రక్రియలో భాగంగా మన రాష్ట్రంలో లక్షల సంఖ్యలో, దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో అసంబద్ధ కారణాలతో పౌరుల ఓట్లను తొలగించారు. అయితే, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పది నెలల కాలంలో 14 అభ్యంతరాలను లేవనెత్తిన విషయం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బయటపెట్టిన తరువాత ఈ ప్రక్రియ ఎంత అస్తవ్యస్తంగా సాగిందో అందరికీ తెలిసివచ్చింది. ఇద్దరు తోటి కమిషనర్లు అభ్యంతరాలు లేవనెత్తినా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికారుల సహకారంతో ఈ ప్రక్రియను తన పద్ధతిలోనే కొనసాగించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల సహకారం లేకుండా ఇదంతా జరగడం సాధ్యం కాదని ఎవరైనా గ్రహిస్తారు. బిహార్‌లో సర్ ప్రారంభించినప్పుడే, దానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వచ్చాయి. చివరకు సుప్రీంకోర్టు బిహార్‌లో 'సర్'పై వ్యాజ్యాన్ని కొట్టివేయడమేగాక, ఎన్నికల కమిషన్ కచ్చితమైన ఓటరు జాబితాలను తయారుచేస్తున్నదని కితాబు ఇచ్చింది. దీంతో ఈ ప్రక్రియ హిమాచల్‌ప్రదేశ్, జమ్ము అండ్ కశ్మీర్, లడఖ్ తప్ప దేశమంతా దాదాపు పూర్తయింది. 13.37 కోట్ల ఓట్లు తొలగించారు. ఇప్పుడు సర్‌లో అవకతవకలు బయటపడడంతో, దీనిని అనుమతించినందుకు సుప్రీంకోర్టు తీవ్రమైన ప్రశ్నలు ఎదుర్కొంటున్నది.ఇదిలా ఉండగా, అధికారవర్గాల ప్రయత్నాలు మరొక రకంగా ఉన్నాయి. సర్‌లో ఓట్లు పోయిన అర్హులైన వారందరినీ తిరిగి ఓటర్లుగా గుర్తిస్తామనీ, వారందరూ ఫారం 6 పెట్టుకోవచ్చని జ్ఞానేశ్ కుమార్ చెబుతున్నారు. ఈ విధంగా సర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలను నీరుగార్చవచ్చని చూస్తున్నారు. కానీ ఫారం 6 ఓట్లు పోయిన వారికి పనికిరాదు. సెప్టెంబర్ 2016లో, ఇంకా ప్రధానంగా ఆగస్టు 2022లో 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలెక్టర్స్ రూల్స్'కు మోదీ ప్రభుత్వం చేసిన సవరణల ఫలితంగా ఫారం 6లో మౌలికమైన తేడా వచ్చింది. మారిన ప్రస్తుత రూపంలో ఫారం 6ను ఉపయోగించి గానీ లేదా మరొక రూపంలో గానీ ఓటు కోల్పోయిన వారికి తిరిగి ఓటు కల్పించడం సాధ్యం కాదు. సర్ రద్దైతే ఓట్లు పోవడమే ఉండదు. అదే సమగ్రమైన పరిష్కారం. ఆపైన ఓటు పోయినవారు తిరిగి ఓటరు జాబితాలో చేరే అవకాశాలను పునరుద్ధరిస్తూ ఫారం 6లో అందుకు అవసరమైన మార్పులను చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 45 లక్షల మంది ఓట్లను గైర్హాజరు, శాశ్వతంగా చిరునామా మారినవారు, డూప్లికేట్, చనిపోయినవారు అనే పేరు మీద వారికి లేదా వారి బంధువులకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండానే తొలగించారు. ఆ ఓట్లు లేకుండానే ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించారు. తొలగించిన వారి పేర్లను పంచాయతీ కార్యాలయాల్లో వేలాదదీశారు. అవి గాలికి కొట్టుకుపోయాయి. ప్రధానంగా వలస కార్మికుల ఓట్లు తొలగించారు. ఆ విషయం ఇప్పటికీ వారికి తెలియదు. క్షేత్రస్థాయి పరిశీలనలో బతికున్నవారిని చనిపోయినట్లు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. డూప్లికేట్ కాకపోయినా డూప్లికేట్ అని నమోదుచేసి ఓటు తొలగించారు. ఇక, వలస కార్మికులు బతుకుతెరువు కోసం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్తారు. వారు శాశ్వతంగా చిరునామా మార్చుకోరు. వారి శాశ్వత చిరునామా వారి ఊరే. అక్కడ వారికి ఇల్లు, పొలం కూడా ఉండవచ్చు. లేదా వారి ఓట్లు తమ బంధువుల ఇంటి అడ్రసులో రాయించుకుంటారు. అటువంటి వలస కార్మికులను శాశ్వతంగా చిరునామా మారినవారిగా నమోదుచేసి, వారి ఓట్లను తొలగించి ఎన్నికల అధికారులు పని ముగించుకున్నారు. ముసాయిదా జాబితాకు ముందే తొలగించిన 45 లక్షల ఓట్లలో అత్యధిక ఓట్లు వలస కార్మికులవే. 2026 మే 25 నాటికి మన రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య సుమారు 4.16 కోట్లు. సర్ ప్రక్రియలో భాగంగా సుమారు 44.89 లక్షల మంది ఓటర్లను తొలగించి 3.71 కోట్ల ఓటర్లతో జూలై 31న ముసాయిదా జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో ఓటు ఉన్నంత మాత్రాన ఓటు ఖరారు అయినట్లు కాదు. ఈ 3.71 కోట్లలో కూడా 44.28 లక్షల మందికి తమ ఓటును రుజువు చేసుకోమని నోటీసులు ఇచ్చారు. జూలై 31న ప్రారంభమైన ఈ ప్రక్రియ నవంబర్ 20కి పూర్తవుతుంది. వీరిలో సుమారు 1 లక్షా 69 వేల మందిని ఇప్పటికే అనర్హులుగా ప్రకటించారు. ఈ సంఖ్య రెండు లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ఇవిగాక వివిధ పార్టీల కార్యకర్తలు ఇతర పార్టీల అభిమానుల ఓట్లు తొలగించడానికి ఫారం7 పెడుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తన కంప్యూటర్ వ్యవస్థలోనే ఫారం7 దరఖాస్తులు సృష్టించి, వాటి ఆధారంగా ఓట్లు తొలగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్‌లో ఎంత ప్రభావం చూపిస్తుందో తెలియదు. ప్రత్యామ్నాయ పద్ధతిలో గణిస్తే, మన రాష్ట్రంలో వయోజనుల జనాభా జూలై 1, 2026 నాటికి 4 కోట్ల 20 లక్షలని అంచనా. సర్ ప్రక్రియ తరువాత తుది ఓటర్ల జాబితాలో 3 కోట్ల 70 లక్షల మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండరని తెలుస్తోంది. అంటే, మిగిలిన సుమారు 50 లక్షల మంది ఓట్లు వారికి తెలియకుండా తొలగిస్తున్నారు. ఈ క్రమం కొనసాగితే ప్రజాస్వామ్యం మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. మన రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్రాన్ని నిలదీయాలి.



ఇథనాల్‌పై రాహుల్‌గాంధీ చెప్పింది పట్టదా?

కేంద్రంలో మోదీ ప్రభుత్వం 2021లో తీసుకువచ్చిన జు20 విధానానికి అనుగుణంగా దేశవ్యాప్తంగా ఇథనాల్ పరిశ్రమలు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిపాలనా కాలంలో, నాటి కరోనా సమయాన్ని ఉపయోగించుకుని, కేంద్రం ఇచ్చిన మినహాయింపు మేరకు, ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణా చేయకుండా అనేక ఇథనాల్ పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వివిధ జిల్లాలలో మొత్తం 30 ఇథనాల్ పరిశ్రమలు అలా అనుమతులు పొందాయి.2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గద్వాల జిల్లా పెద ధనవాడలలో ఇథనాల్ కంపెనీలకు ఇచ్చిన అనుమతులను స్థానిక ప్రజల వ్యతిరేకత కారణంగా నిర్మాణ దశలోనే రద్దు చేసింది. 2025 మధ్యలో వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ఒక కంపెనీ ముందుకు వచ్చినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ హియరింగ్ నిర్వహించింది. స్థానిక ప్రజలు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించడంతో, ఆ కంపెనీ యాజమాన్యం తమ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నాం అని పబ్లిక్ హియరింగ్‌లోనే ప్రకటించింది. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఒక సానుకూల అభిప్రాయాన్ని కలిగించాయి.బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు ఇథనాల్ పరిశ్రమ జల, వాయు కాలుష్యాలకు కారణమవుతుండడంతో స్థానిక ప్రజలు సంవత్సర కాలం ఉద్యమాలు సాగించారు. ఆ ఉద్యమాలకు అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆ ఉద్యమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధంగా అణచివేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆ పరిశ్రమ అలా కొనసాగుతూనే ఉంది. దాని కాలుష్యంపై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా, గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అంతేగాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కామారెడ్డి, సిద్దిపేట, నారాయణపేట, సూర్యాపేట జిల్లాలలో అనుమతులు పొందిన మరో ఆరు ఇథనాల్ పరిశ్రమలు కూడా ఉత్పత్తి ప్రారంభించి, ఇప్పటికే స్థానికంగా తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఘన వ్యర్థాలను చుట్టూ పొలాల్లో పారబోస్తున్నాయి. ద్రవ వ్యర్థాలను నదుల్లోకీ, వాగుల్లోకీ వదులుతున్నాయి. ఫలితంగా స్థానికంగా భూగర్భ జలాలు, నదులు, వాగులు పాడవుతున్నాయి. వాయుకాలుష్యం, దుర్వాసనల వల్ల స్థానికంగా ప్రజలకు నివసించలేని స్థితి ఏర్పడింది. ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆ పరిశ్రమల చుట్టూ ఉన్న పంట పొలాలలో దిగుబడులు పడిపోతున్నాయి. ఆ పొలాల్లో పని చేయడానికి వ్యవసాయ కూలీలు రావడం లేదు. ఆయా గ్రామాల యువకులకు తమ అమ్మాయినిచ్చి పెళ్లిచేయడానికి కూడా తల్లిదండ్రులు వెనుకాడుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.'ఇథనాల్ ఉత్పత్తికి ప్రభుత్వం ఇస్తున్న భారీ సబ్సిడీలు, రాయితీలు సామాన్య చెరుకు లేదా మొక్కజొన్న రైతులకు చేరడం లేదు. అవి కేవలం అధికార పార్టీకి సన్నిహితులైన కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకుల యాజమాన్యంలోని డిస్టిలరీలకు మాత్రమే లాభం చేకూరుస్తున్నాయి' అని గత ఏడాది స్వయంగా రాహుల్‌గాంధీ ప్రకటించారు. 'ఆహార ధాన్యాలను ఇంధన తయారీకి మళ్లించడం వల్ల భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పు కలుగుతుంది, పర్యావరణ నిబంధనలను సడలించి డిస్టిలరీలకు అనుమతులు ఇవ్వడం వల్ల స్థానిక జల వనరులు కలుషితమవుతున్నాయి' అని కూడా ఆయన తేల్చి చెప్పారు. తెలంగాణలో ఇథనాల్ కంపెనీ యాజమాన్యాలు కాలుష్యం విషయంలో అన్యాయంగా వ్యవహరిస్తున్నా ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటే, ఈ అంశంలో రాహుల్ వైఖరికి భిన్నమైన వైఖరిని ఇక్కడి ప్రభుత్వం తీసుకుంటున్నదని అనుకోవాల్సి వస్తుంది. మోదీ, కేసీఆర్ పంథాలోనే ఇథనాల్ కంపెనీల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని భావించాల్సి వస్తుంది. పైపెచ్చు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నల్లగొండ జిల్లాలో మరో రెండు ఇథనాల్ పరిశ్రమల నిర్మాణానికి సహకారం అందిస్తున్నది. అడవి దేవులపల్లి మండలం, ముదిమాణిక్యం గ్రామంలో ఇథనాల్ కంపెనీ గతంలో పొందిన అనుమతులతో, ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, వేగంగా నిర్మాణ పనులను ప్రారంభించడానికి సిద్ధపడుతున్నది. ఈ కంపెనీ యాజమాన్యం ఇప్పటికే కృష్ణా జిల్లా గండేపల్లిలో ఒక ఇథనాల్ కంపెనీని నిర్వహిస్తూ కాలుష్యాన్ని వెదజల్లుతున్నది.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దామరచర్ల మండలం వీర్లపాలెంలో కొత్త ఇథనాల్ కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనపై నవంబర్ 20న పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నది. ఒక లీటరు ఇథనాల్ తయారీకి కనీసం 8 లీటర్ల నీరు అవసరం. ఈ పరిశ్రమ కోసం రోజుకు 50లక్షల లీటర్ల నీరు అవసరమని దాని పర్యావరణ ప్రభావ నివేదికలో పేర్కొన్నారు.అందులో పరిశ్రమ నుంచి వెలువడే విష రసాయనాల ప్రస్తావనే లేదు. పైగా చట్టవిరుద్ధంగా రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా కృష్ణానది నుంచి పైప్‌లైన్ ద్వారా నీళ్లు తెస్తామని పేర్కొన్నారు. నీళ్లకు అత్యంత ఇబ్బంది పడుతున్న మన రాష్ట్రంలో ఇంతటి భారీ నీటి అవసరమున్న ఇథనాల్ కంపెనీలకు అనుమతి ఇవ్వటం కోసం పబ్లిక్ హియరింగ్ నిర్వహించడానికి మించిన అన్యాయం ఏముంటుంది? ఇక తెలంగాణ రాష్ట్రానికి కాలుష్య కారక ఇథనాల్ పరిశ్రమలు రావులే అని ప్రజలు అనుకుంటున్న సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ కంపెనీల ఏర్పాటుకు అనుగుణంగా అడుగులు వేయడం ఆందోళనకరం.ఇప్పటికే ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ప్రజలు తాగునీటికే ఇబ్బందులు పడుతున్నారు. 2026 వానాకాలంలో లక్షల ఎకరాలలో పంటలు ఎండి, దిగుబడులు తగ్గి, రైతులు తీవ్రంగా నష్టపోయారు. 365 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వమే నివేదిక ఇచ్చింది. రానున్న జూలై వరకూ గడ్డు పరిస్థితులు ఉంటాయనీ, విద్యుత్తు, నీరు పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం కూడా ప్రచారం చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఒక్కోటి రోజుకు 50 లక్షల లీటర్ల చొప్పున నీటిని వాడుకునే రెండు ఇథనాల్ కంపెనీలకు నల్లగొండ జిల్లాలో అనుమతులు ఇవ్వబోవడం న్యాయమా?తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమల విషయంలో ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. తాజాగా నల్లగొండ జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తలపెట్టిన పబ్లిక్ హియరింగ్‌ను రద్దు చేయాలి. రాష్ట్రంలో ఇథనాల్ పరిశ్రమలకు ఇప్పటికే ఇచ్చిన అనుమతులన్నిటినీ వెనక్కు తీసుకోవాలి. కాలుష్యం వెదజల్లుతున్న ఇథనాల్ పరిశ్రమలను పూర్తిగా మూసేయాలి.



బాచుపల్లి లేఅవుట్‌లో 40 ప్లాట్లు విక్రయం.. గరిష్ఠంగా గజం ధర రూ.60,500

హైదరాబాద్ మహానగర పరిధిలోని బాచుపల్లి లేఅవుట్‌లో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్వహించిన నివాస ప్లాట్ల ఈ-వేలానికి కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈరోజు నిర్వహించిన ఆన్‌లైన్ వేలం ద్వారా మొత్తం 40 ప్లాట్లు అమ్ముడై, రూ.55.43 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు ప్రకటించారు.ఈ వేలంలో హెచ్ఎండీఏ మొత్తం 50 నివాస ప్లాట్లను అమ్మకానికి ఉంచగా, అందులో 40 ప్లాట్లు విజయవంతంగా విక్రయమయ్యాయి. అంటే సుమారు 80 శాతం ప్లాట్లను బిడ్డర్లు సొంతం చేసుకున్నారు. మిగిలిన 10 ప్లాట్లకు బిడ్లు దాఖలు కాలేదు. వేలంలో గరిష్ఠంగా చదరపు గజం ధర రూ.60,500 పలకగా, అన్ని ప్లాట్ల సగటు ధర (వెయిటెడ్ యావరేజ్) చదరపు గజానికి రూ.49,737 గా నమోదైంది. అత్యధిక ధర సగటు ధర కంటే దాదాపు 21.6 శాతం ఎక్కువగా ఉండటం విశేషం.

సొంత ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారితో పాటు స్థిరాస్తి పెట్టుబడిదారుల నుంచి కూడా ఈ వేలానికి మంచి స్పందన వచ్చిందని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.



బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో.. నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య



ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. పీఎఫ్ విషయంలో మూడు కీలక మార్పులు

పదవీ విరమణ తర్వాత లేదా ఉద్యోగం మారినప్పుడు పీఎఫ్ ఖాతాలోని సొమ్మును ఎలా పొందాలనే అంశంపై ఉద్యోగుల్లో ఎప్పుడూ ఆసక్తి, ఆందోళనా రెండూ ఉంటాయి. కష్టపడి కూడబెట్టిన సొమ్ము అవసరమైన సమయానికి చేతికందు తుందా లేదా నిబంధనల ఉచ్చులో చిక్కుకుంటుందా అనే సందిగ్ధతకు ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలతో తెరదించింది. ఉద్యోగుల ఆర్థిక అవసరాలు, విరమణ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పీఎఫ్ విత్‌డ్రా, సెటిల్మెంట్ విధానాల్లో విప్లవాత్మకమైన మూడు భారీ మార్పులను ఖరారు చేసింది. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. నెలకు పింఛన్ లాంటి ఆదాయంరిటైర్మెంట్ సమయంలో పీఎఫ్ నిధి మొత్తాన్ని ఒకేసారి మొత్తంగా తీసుకోవాల్సిన పాత పద్ధతికి సరికొత్త ప్రత్యామ్నాయం వచ్చింది. ఉద్యోగుల కోసం సరికొత్త సిస్టమాటిక్ విత్‌డ్రావల్ ప్లాన్ (ఎఫ్ఐ) సదుపాయం రానుంది. దీని ప్రకారం విరమణ అనంతరం ఖాతాదారులు తమ అవసరాన్ని బట్టి నెలవారీ, త్రైమాసిక లేదా అర్ధవార్షిక వాయిదాల రూపంలో నిర్దిష్ట మొత్తాన్ని తీసుకోవచ్చు. మిగిలిన మొత్తంపై ఈపీఎఫ్ వడ్డీ రేటు యథావిధిగా వర్తిస్తుంది. ఇది స్వచ్ఛంద నిర్ణయం మాత్రమే కావడంతో ఒకేసారి లంప్‌సమ్ సొమ్ము తీసుకోవాలనుకునే వారికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. ప్రాథమిక దశలో 55 ఏళ్లు దాటిన దాదాపు 6.32 లక్షల మంది ఉద్యోగులకు ఇది వరంగా మారనుంది. అయితే, ఇది ఈపీఎస్ పెన్షన్‌కు ప్రత్యామ్నాయం కాదని, ఉద్యోగి వ్యక్తిగత పీఎఫ్ నిధి నుంచి పొందే ఆదాయమని గుర్తించాలి.90 శాతం వరకు నగదు ఉపసంహరణ గతంలో అత్యవసర సమయాల్లో పాక్షిక విత్‌డ్రావల్స్ కోసం దరఖాస్తు చేస్తే ఖాతాలో కనీసం 25 శాతం నిల్వ ఉంచాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిమితిని భారీగా కుదిస్తూ ఖాతాలో కనీస బ్యాలెన్స్ నిబంధనను 10 శాతానికి తగ్గించారు. ఫలితంగా ఉద్యోగులు తమకు అర్హత ఉన్న నిధి నుంచి



ఏకంగా 90 శాతం వరకు నగదును ఉపసంహరించుకోవచ్చు. ఉదాహరణకు పీఎఫ్ ఖాతాలో రూ.10 లక్షల బ్యాలెన్స్ ఉంటే, గతంలో రూ.2.5 లక్షలు తప్పనిసరిగా ఖాతాలో ఉంచి గరిష్ఠంగా రూ.7.5 లక్షలే పొందే వీలుండేది. తాజా నిర్ణయంతో రూ.1 లక్ష ఉంచి ఏకంగా రూ.9 లక్షల వరకు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. ఇళ్ల నిర్మాణం, పిల్లల ఉన్నత చదువులు, వైద్య ఖర్చుల కోసం నిధుల కొరత ఎదుర్కొనే ఉద్యోగులకు ఇది ఊరటనిస్తుంది. ఉద్యోగం పోయిన 2 నెలలకే పూర్తి సెటిల్మెంట్ ఉద్యోగం కోల్పోయినప్పుడు లేదా అనుకోకుండా కెరీర్‌లో బ్రేక్ వచ్చినప్పుడు పీఎఫ్ ఖాతాలోని పూర్తి మొత్తాన్ని వెనక్కి తీసుకోవడానికి గతంలో ఏడాది పాటు ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ నిబంధనను పూర్తిగా మార్చివేస్తూ నిరీక్షణ కాలాన్ని కేవలం రెండు నెలలకు కుదించారు.

బిజినెస్

దిగ్గజ సంస్థలకు సైబర్ సెగ
వీసా, మాస్టర్‌కార్డ్ కస్టమర్ల డేటా లీక్



ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక సేవల సంస్థలు వీసా, మాస్టర్‌కార్డ్, జేపీ మోర్గాన్ చేజ్‌కు సైబర్ దాడి సెగ తగిలింది. తమ కస్టమర్లకు సంబంధించిన కొంత సమాచారం బయటకు పొక్కినట్లు ఈ సంస్థలు ధ్రువీకరించాయి. అయితే, ఈ దాడి తమ సొంత సిస్టమ్స్‌పై జరగలేదని, తమకు సేవలు అందించే థర్డ్-పార్టీ సంస్థలే లక్ష్యంగా జరిగిందని స్పష్టం చేశాయి. ఈ ఘటనల వల్ల తమ కోర్ పేమెంట్ నెట్‌వర్క్‌లకు గానీ, చెల్లింపుల వ్యవస్థలకు గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని భరోసా ఇచ్చాయి.'అ0ఆ' అనే రాన్సమ్‌వేర్, దోపిడీ ముఠా ఈ సైబర్ దాడులకు బాధ్యత వహించింది. డబ్బులు చెల్లించేందుకు తాము విధించిన గడువు ముగియడంతో నిన్న కస్టమర్ల డేటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు ఈ గ్రూప్ ప్రకటించింది. లీకైన డేటాలో కస్టమర్ల కార్డు నంబర్లు, లావాదేవీల వివరాలు వంటి అత్యంత కీలకమైన సమాచారం లేదని, కేవలం ఈమెయిల్ చిరునామాలు, పేర్లు, మార్కెటింగ్ లేదా లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన రికార్డులు మాత్రమే ఉన్నాయని తెలిసింది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోని తమ థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్‌పై ఈ దాడి జరిగిందని వీసా పేర్కొంది. ప్రీమియం డైనింగ్, లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన వేలాది మంది కార్డుదారుల వివరాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. తమ పేమెంట్ సిస్టమ్స్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, కార్డు వివరాలు సురక్షితంగా ఉన్నాయని వీసా తెలిపింది.

టాటా గ్రూప్‌లో అధికార పోరు.. లిస్టింగ్‌పై చర్చకు సిద్ధమైన అతిపెద్ద వాటాదారు



దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన టాటా గ్రూప్‌లో అంతర్గత వివాదం తీవ్ర రూపం దాల్చింది. హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌ను పబ్లిక్ లిస్టింగ్ చేయాలా వద్దా అనే అంశంపై గ్రూప్‌లో భిన్నాభిప్రాయాలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల మధ్య, టాటా గ్రూప్‌లో కీలకమైన రెండు వారాలు మొదలయ్యాయి. శుక్రవారం నాడు టాటా ట్రస్టుల బోర్డు సమావేశం జరగను ండగా, వచ్చే వారం టాటా సన్స్ బోర్డు భేటీ కానుంది. ఈ సమావేశాల ఫలితాలు గ్రూప్ భవిష్యత్తును నిర్దేశించ నున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ వివాదానికి ప్రధాన కారణం ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయమే. టాటా సన్స్‌ను 'అప్పర్ లేయర్' నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా (ఎన్‌బీఎఫ్‌సీ) వర్గీకరించ డంతో నిబంధనల ప్రకారం కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయడం తప్పనిసరి అయింది. అయితే, టాటా సన్స్‌లో 66% వాటాతో మెజారిటీ వాటాదారుగా ఉన్న టాటా ట్రస్టుల ఛైర్మన్ నోయెల్ టాటా, ఈ లిస్టింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లిస్టింగ్ వల్ల గ్రూప్ నియంత్రణను కోల్పోవడమే కాకుండా, లాభార్జనే ధ్యేయంగా మారి, దాతృత్వం అనే 'టాటా వే' దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఇతర బోర్డు సభ్యులు మాత్రం ఆర్బీఐ నిబంధనలను పాటించాల్సిందేనని, లిస్టింగ్ ద్వారా కంపెనీలో పారదర్శకత పెరుగుతుందని వాదిస్తున్నారు.ంగత సెప్టెంబర్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ విభేదాలు తొలిసారి బయటపడ్డాయి. లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలనే ప్రతిపాదనను, చంద్రశేఖరన్ పదవీకా లాన్ని మరో ఐదేళ్లు పొడిగించాలనే నిర్ణయాన్ని నోయెల్ టాటా వ్యతిరేకించినప్పటికీ, బోర్డు ఆయన అభ్యంతరాలను తోసిపుచ్చింది.

స్పోర్ట్స్

నేను 'సెహ్వాగ్ 2.0' కావడానికి రాలేదు.. తండ్రితో పోలికపై ఆర్యవీర్ బోల్డ్ కామెంట్స్



భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ తన తండ్రితో వస్తున్న పోలికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను మరొకరి నీడలా ఉండటానికి రాలేదని, క్రికెట్ ప్రపంచంలో తనకం టూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించడానికే వచ్చా నని స్పష్టం చేశాడు. అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలకపాత్ర పోషించిన ఆర్యవీర్, తండ్రితో పోల్చడంపై తొలిసారి మనసు విప్పి మాట్లాడాడు.'కెరీర్ ప్రారంభంలోనే నా తండ్రితో పోలికలు తప్పవనే నిజాన్ని గ్రహించాను. దాన్ని నేను ఆపలేను. మా ఇద్దరి ఆటలో ఎవరైనా పోలికలు చూస్తున్నారంటే అది వారి అభిప్రాయం. మా నాన్నపై వారికి ఉన్న ప్రేమ మాత్రమే. కానీ నేను ఇక్కడికి 'సెహ్వాగ్ 2.0' కావడానికి రాలేదు. ఆర్యవీర్ సెహ్వాగ్‌గా నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి వచ్చాను. రెండో సెహ్వాగ్‌గా నిలవడం కంటే మొదటి ఆర్యవీర్‌గా ఉండటానికే ఇష్టపడతాను" అని జియోస్టార్‌తో మాట్లాడుతూ ఆర్యవీర్ స్పష్టం చేశాడు.ఈ టోర్నమెంట్‌లో ఆర్యవీర్ అద్భుతమైన ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం 5 మ్యాచుల్లో 90.25 సగటు, 95కు పైగా స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 361 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో తీవ్ర గాయంతోనూ అద్భుత పోరాటపటిమ ప్రదర్శించాడు. 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో మోచేతికి బలమైన దెబ్బ తగిలి విపరీతమైన నొప్పి వేధిస్తున్నప్పటికీ, పెయిన్‌కిల్లర్స్ వేసుకుని 61 బంతుల్లో 58 విలువైన పరుగులు సాధించాడు. భారత్ ఒక వికెట్ తేడాతో థ్రిల్లింగ్ విజయం సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

పంజాబ్ కింగ్స్‌లోకి హార్దిక్ పాండ్యా ఎంట్రీ.. అసలు వ్యూహం బయటపెట్టిన రికీ పాంటింగ్!



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రాకతో ఐపీఎల్ 2027 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ జట్టు సమతూకంగా మారిందని ఆ జట్టు ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. వేలానికి ముందే ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఇచ్చి, భారీ ట్రేడింగ్ ద్వారా హార్దిక్‌ను పంజాబ్ తమ గూటికి చేర్చుకుంది. పేస్, స్పిన్ విభాగాల్లో నాణ్యమైన ఆల్‌రౌండర్ల బలం తమకు కలిసొచ్చే అంశమని పాంటింగ్ తెలిపాడు.రాబోయే సీజన్ కోసం తాము కేవలం ఆరుగురు ఆటగాళ్లను మాత్రమే విడుదల చేసి, 19 మందిని రీటైన్ చేసుకున్నట్లు పాంటింగ్ వెల్లడించాడు. "హార్దిక్ రాకతో పాటు ఇప్పటికే జట్టులో ఉన్న మార్కో జాన్సెన్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా, శశాంక్, సూర్యాంశ్ షెడ్గే, కూపర్ కానోలీ వంటి ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్ విభాగాల్లో అవసరమైన అన్ని స్థానాలను భర్తీ చేసుకున్నాం. డిసెంబరు 16న గోవాలో జరిగే వేలంలో మా ప్రధాన లక్ష్యం తుది జట్టును మరింత పటిష్ఠం చేసుకోవడమే. ఆ తర్వాత భవిష్యత్తు కోసం ప్రతిభావంతులైన యువ భారత ఆటగాళ్లను ఎంపిక చేయడంపై దృష్టి పెడతాం" అని పాంటింగ్ తెలిపాడు.మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ నుంచి వెటరన్ పేసర్ మహమ్మద్ షమీని రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ ద్వారా దక్కించుకుంది. సంజూ శాంసన్ జట్టును వీడిన తర్వాత ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నామని రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ కుమార్ సంగక్కర చెప్పాడు. ఇప్పటికే రవీంద్ర జడేజా, సామ్ కరన్, డొనొవన్ ఫెరీరా వంటి ఆటగాళ్లను ట్రేడ్ ద్వారా తీసుకున్నామని, జట్టు ప్రధాన బలం అలాగే ఉందని ఆయన పేర్కొన్నాడు. ఇక వెస్టిండీస్ హిట్టర్ షిమ్రాన్ హెట్‌మయర్ భిన్నమైన బ్యాటింగ్ స్థానాన్ని కోరుకోవడంతో పాటు, వేలంలో పర్స్ వాల్యూ పెంచుకునేందుకే అతడిని విడుదల చేయాల్సి వచ్చిందని సంగక్కర వివరించాడు.

సిరాజ్‌ను పక్కనపెట్టడంపై రాజకీయ దుమారం.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌ను న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో తుది జట్టు నుంచి తప్పించడం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. సిరాజ్ పేరు కారణంగానే అతడిని జట్టులోకి తీసుకోలేదని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఆరోపించగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. దీంతో క్రికెట్ జట్టు ఎంపిక విషయంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది.వెల్లింగ్‌టన్ వేదికగా నిన్న ప్రారంభమైన ఈ టెస్టు మ్యాచ్‌లో నలుగురు పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అన్షుల్ కంబోజ్‌లతో భారత్ బరిలోకి దిగింది. అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను కాదని కొత్తవారికి అవకాశం ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై 'ఏఎన్ఐ' వార్తా సంస్థతో మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్.. "సిరాజ్ మంచి ప్రదర్శన కనబరుస్తున్నప్పటికీ, అతడిని జట్టులోకి తీసుకోలేదు. అతని పేరు 'సిరాజ్' కావడం వల్లే ఈ అన్యాయం జరిగింది. ఇది స్పష్టమైన వివక్ష" అని సంచలన ఆరోపణలు చేశారు.కాంగ్రెస్ వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ క్రికెట్ ఎంపికల్లోకి ఓటు బ్యాంకు, మత రాజకీయాలను చొప్పిస్తోందని ఆయన మండిపడ్డారు. తన 'ఎక్స్' ఖాతాలో స్పందిస్తూ.. "ఈ మ్యాచ్‌లో సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను కూడా పక్కనపెట్టారు. భారత జెర్సీ ధరించిన ప్రతి ఆటగాడు దేశం కోసమే ఆడతాడు" అని బదులిచ్చారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com